
# ప్రజాభూమి
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com


## పకడ్బందీగా గ్రూప్ 1 పరీక్షలు
సీఎస్ శాంతి కుమారి సమీక్ష



2


తెలంగాణ ఎడిటర్ : విప్పల చంద్రశేఖర్ | శనివారం | 19.10.2024 | పేజీలు: 08 | నమూనా సంచిక | వెల : అముల్యం




2

# గుడిమీద చేయి వేయాలంటే.. గజ్జుమనాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



- ముఖ్యమంత్రి రేవంత్ ఓట్ల రాజకీయం బంద్ చేయ్
- ఆలయాలపై దాడులపై వెంటనే విచారణ జరపండి
- విద్వేషాలు రెచ్చగొట్టే మీటింగ్స్ పెడితే ఇంటెలిజెన్స్ ఏం చేస్తుంది?
- మీరు పట్టించుకోకుంటే మోడీ సర్కార్ ఉక్కుపాదం మోపుతుంది

# అట్టుడుకిన అశోక్‌నగర్





- గ్రూప్1 అభ్యర్థుల ఆందోళన ఉద్రిక్తం
- రోడ్లపైకి వచ్చి ప్లకార్డులను ప్రదర్శన
- జీవో 29 రద్దు.. పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్
- ఉరికించి కొట్టిన పోలీసులు.. పలువురికి గాయాలు
- రీ షెడ్యూలింగ్ కోరుతూ దాఖలైన అప్పీల్ పిటిషన్ హైకోర్టు కొట్టివేత
- సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్
- ఈ నెల 21 నుంచి యథావిధిగా మెయిన్స్ ఎగ్జామ్స్
- అటు సుప్రీంను ఆశ్రయించిన అభ్యర్థులు
- విచారణ సోమవారానికి వాయిదా




**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

అశోక్ నగర్‌లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గ్రూప్ 1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు చేస్తున్న ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతోంది. పరీక్ష వాయిదా కోసం మూడో రోజు శుక్రవారం ఆందోళనకు దిగిన అభ్యర్థులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. మెయిన్స్ పరీక్షను వాయిదా వేసే వరకు తాము నిరసన చేస్తామంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని డిమాండ్లు చేయడం ప్రారంభించారు. పోలీసులు అక్కడకు

మిగతా 2లో..

# మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం

- సుందరీకణకు మేం వ్యతిరేకం కాదు
- మూసీకి ఇరువైపుల రిటైనింగ్ వాల్ నిర్మించి, అభివృద్ధి చేయండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చడం న్యాయం కాదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. మూసీ సుందరీకరణను, పునరుజ్జీవన చర్యలను తాము వ్యతిరేకించడం లేదని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా మూసీ సుందరీకరణ చేయాలని కోరారు. మూసీ నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి, అభివృద్ధి చేయాలని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో

మిగతా 2లో..

# మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్

- రీజువెనేషన్ స్పెల్లింగ్ చెప్తే రేవంత్‌కు 50 లక్షలిస్తా
- గ్రాఫిక్స్ మాయాజాలంతో సీఎం పూటకో మాట
- ఢిల్లీకి మూటలు పంపేందుకే ఈ ప్రాజెక్ట్ చేపట్టారు
- 420 హామీలతో ప్రజల గొంతు కోశారు
- తప్పును కప్పిపుచ్చుకు-నేందుకు నానా తంటాలు పడుతుండు
- మూసీ ప్రాజెక్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మూసీని మురికి కూపంగా మార్చింది గత ప్రభుత్వాలేనని అవి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మూసీ ప్రాజెక్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. 1908లో వరదలు వచ్చినప్పుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య డిజైన్ చేసిన రిజర్వాయర్లు, పార్కులు తప్ప కేసీఆర్ వచ్చేదాకా ఏ ప్రభుత్వం కూడా మూసీ ప్రక్షాళన ప్రయత్నాలు

మిగతా 2లో..

## కేటీఆర్ పరువు నష్టం కేసు వాయిదా

సోమవారానికి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

అదే రోజు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తామని వెల్లడి

2

## అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన వాన్ని వదలం

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

2

## కరీంనగర్ బీఆర్ఎస్‌లో కేసుల భయం


ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు జైలుపాలు

వివాదాస్పద భూముల్లో ఇరుక్కున్న గులాబీనేతలు

తాజాగా మేయర్, నగర బీఆర్ఎస్ అధ్యక్షులపై కేసులు

2

# స్కిల్ వర్సిటీకి అదానీ గ్రూప్ రూ.100 కోట్ల విరాళం



- ముఖ్యమంత్రి రేవంత్‌కు చెక్కు అందజేసిన గౌతమ్ అదానీ
- భవిష్యత్తులోనూ మరింత మద్దతు ఇస్తామని హామీ

2

# సర్కార్ పేదలకు అన్యాయం చేస్తోంది

- హైడ్రా, మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకంగా ఈ నెల 25న భారీ ధర్నా చేస్తాం
- మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటిస్తాం
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



2

# గుడిమీద చేయి వేయాలంటే గజ్జుమనాలి






**ప్రజాభూమి, తెలంగాణ బ్యూరో :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిక్కుమాలిన ఓట్ల రాజకీయం పక్కన పెట్టు అని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ కుమ్మరగూడ ముత్యాలమ్మ గుడిని ఆయన సందర్శించి మాట్లాడారు. విద్వేషాలు రెచ్చగొట్టేందుకు సిటీలో మీటింగ్ పెడితే ఇంటెలిజెన్స్ పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీస్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ బాంబు దాడిలో చనిపోయారని, లుంబిని పార్క్, గోకుల్ చాట్, సాయిబాబా గుడి దగ్గర బాంబులు పేల్చితే ఎగిరి పడ్డ మాంసం ముద్దులు గుర్తుకు లేవా అని మండిపడ్డారు. అలాంటి దుర్మార్గులకు ఆశ్రయమిస్తే.. రక్తం మరిగిన పులుల లెక్క అందరిపైనా దాడి చేస్తారని హెచ్చరించారు. ఉన్మాదులకు కులం, మతంతో సంబంధం ఉండదని, ఈ ఉన్మాదాన్ని అణచకపోతే ప్రపంచానికే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాళ్లను ఉపేక్షిస్తే చరిత్ర క్షమించదన్న సంగతి రేవంత్ గుర్తించాలన్నారు. తాము గోవులను పూజించే సాదువలమని, తమ నియంత్రించాలనే ప్రయత్నాలు మాని దుర్మార్గులను నియంత్రించడంపై దృష్టి సారించాలన్నారు.

**కేంద్రం జోక్యం చేసుకోక తప్పదు..**

రాష్ట్రంలో ఇటీవల వరుసగా ఆలయాలపై దుర్మార్గుల దాడులు కొనసాగుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయనే కోణంలో వెంటనే విచారణ ప్రారంభించాలన్నారు. అమ్మవారి గుండెల మీద తన్నినవాడు హాస్పిటల్ బెడ్‌పై దర్జాగా పడుకొని చాటింగ్ చేస్తున్నాడని, అవమానించేలా పోస్టులు పెడుతున్నాడని అన్నారు. ఆ వ్యక్తి చేతిలోకి సెల్ ఫోన్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఈ దాడులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. ఏ మతం కూడా ఇలాంటి చర్యలను సమర్థించబోదన్నారు. హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా అక్కున చేర్చుకుంటామని, మనం ఏ దేశానికి వెళ్లినా భారతీయులకు గొప్ప మర్యాద ఇస్తారని తెలిపారు. నగర సీపీ సీవీ ఆనంద్‌కు సిటీపై సంపూర్ణమైన అవగాహన ఉందని, ఆయన హైదరాబాద్ క్షేమం కోరేవారని అన్నారు. ఈ ఘటనలను కేవలం విగ్రహ ధ్వంసం కోణంలోనే చూడవద్దన్నారు. ఈ ఘటనలపై ఇంటెలిజెన్స్ బ్యూరో నిఘా పెట్టిందన్నారు. రాజకీయాలు ముఖ్యం కాదు.. దేశ రక్షణే ముఖ్యమని, రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయకపోతే కేంద్రం జోక్యం చేసుకోక తప్పదని తేల్చిచెప్పారు. ఈ ఘటనలపై రేవంత్ తాత్సారం చేస్తే అమాయక ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో శిక్షణ పొంది ఇక్కడ పని చేస్తున్న వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా గుడిపై చేయి వేయాలంటే గజ్జుమనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# అట్టుడుకిన అశోక్‌నగర్

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుని గ్రూప్1 అభ్యర్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే ఎంతకీ అభ్యర్థులు వినకపోవడంతో చేసేదేమీ లేక పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. మాట వినకుండా మొండిగా ఎదురు తిరిగిన గ్రూప్1 అభ్యర్థులు పరుగులు తీయించి మరీ పోలీసులు లాఠీలను పని చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా గ్రూప్1 అభ్యర్థులు నిరసన చేస్తుంటే.. అధికారం ఉంది కదా అని పోలీసులను ఆయుధాలుగా మార్చుకుని వారిపై దాడి చేయడం ఈ ప్రభుత్వానికి తగదంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. అటు మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలంటూ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లిన అభ్యర్థులకు ఎదురుదెబ్బ తగిలింది.

**పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు...**

మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో సింగిల్ బెంచ్ తీసుకున్న తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా సమర్థించింది. దీంతో తెలంగాణలో ఈనెల 21న అంటే సోమవారం నాడు గ్రూప్1 మెయిన్స్ నిర్వహించడానికి మార్గం సుగమం అయింది. కోర్టు నిర్ణయంతో గ్రూప్1 మెయిన్స్ షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయి. ఇప్పటికే గ్రూప్1 మెయిన్స్‌కు సంబంధించి హాల్‌టికెట్లు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులంతా మెయిన్స్ రాయనున్నారు. ఈ మెయిన్స్ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహించనున్నారు. పరీక్ష ప్రారంభమయ్యే ఒక్కరోజు ముందు వరకు హాల్‌టికెట్లు వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటాయి.

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు..**

గ్రూప్1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో 29 ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 29 వల్ల జరిగే నష్టాన్ని ప్రధాన న్యాయమూర్తికి తమ న్యాయవాది వివరించారని విద్యార్థులు చెప్పారు. సోమవారం రోజు మొదటి కేసుగా తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రకటిస్తూ విచారణను వాయిదా వేశారు. జీవో 55నే అమలు చేయాలని విద్యార్థులంతా కోరినా.. సీఎం పెడచెవిన పెట్టారని గ్రూప్1 అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టుతో మొట్టికాయలు కొట్టించుకోక ముందే ప్రభుత్వం దిగివచ్చి జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా గురించి మాట్లాడుతున్న సీఎం.. జీవో 29 వల్ల నష్టపోయే విద్యార్థుల గురించి ఎందుకు స్పందించడం లేదని గ్రూప్ 1 అభ్యర్థులు నిలదీస్తున్నారు.

# కేటీఆర్ పరువు నష్టం కేసు వాయిదా

ప్రజాభూమి, తెలంగాణ బ్యూరో : మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌పై విచారణను ఈ నెల 23కు నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. శుక్రవారం కేటీఆర్ కోర్టు ఎదుట వాగ్మూలం ఇవ్వాల్సి ఉండగా వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోతున్నారని అయన తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. శుక్రవారమే వాంగ్మూలం నమోదు చేస్తామని చెప్పినా మళ్లీ సమయం కావాలని ఎలా అడుగుతారని కోర్టు ప్రశ్నించగా సోమవారం లేదా బుధవారం హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలని ఆయన కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీంతో విచారణను ఈ నెల 23కి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తామని కోర్టు తెలిపింది. మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ ఈ నెల 3న నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ మేరకు నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరపు న్యాయవాది ఉమా మహేశ్వర్‌రావు పిటిషన్‌దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను ఈ నెల 14న విచారించిన నాంపల్లి కోర్టు దాన్ని ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.



# స్కిల్ వర్సిటీకి అదానీ గ్రూప్ రూ.100 కోట్ల విరాళం

**ప్రజాభూమి, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'కి అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ భారీ విరాళం ప్రకటించారు. అదానీ ఫౌండేషన్ తరపున శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ, సీఎస్ శాంతి కుమారి, పురపాలక ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం కార్యాలయం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రకటించింది. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సమావేశం అనంతరం గౌతమ్ అదానీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ చొరవతో రేవంత్ రెడ్డిని కలిసినట్లు తెలిపారు. ఈ క్రమంలో యువత భవిష్యత్తును రూపొందించడం మాత్రమే కాదు.. ప్రకాశవంతమైన, సంపన్నమైన భారతదేశం కోసం అనంతమైన సామర్థ్యాన్ని, రాబోయే తరాలను ఇక్కడ సృష్టించనున్నట్లు వెల్లడించారు. దీంతోపాటు యువత సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మరింత మద్దతు ఇస్తామని అదానీ హామీనిచ్చారు.



# సర్కార్ పేదలకు అన్యాయం చేస్తోంది

**ప్రజాభూమి, తెలంగాణ బ్యూరో :**

హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ సర్కార్ పేద ప్రజలకు అన్యాయం చేస్తోందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. హైడ్రా, మూసీ ప్రక్షాళనలో అన్యాయం పాలైన ప్రజల తరపున ఉద్యమించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది. అందులో భాగంగా ఈ నెల 25న హైడ్రా, మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకంగా భారీ ధర్నా చేపట్టనుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటన చేశారు. ముందుగా ఈ నెల 23, 24 తేదీల్లో మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ నేతలంతా పర్యటిస్తారని వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అనుసరించాల్సిన వ్యూహంపై.. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై చర్చించినట్లు వెల్లడించారు.

# మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి)

గత 30 నుంచి 40 సంవత్సరాలుగా నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేయవద్దని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీ నగర్ డివిజన్, హరిత అపార్ట్మెంట్ లైన్, ఆంధ్ర కేఫ్ ఎక్స్ రోడ్ లో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తో కలిసి సేవరేజ్ లైన్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా అనేక ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్లలో మురుగు నీరు కలవడంతో ప్రజలు రోగాన బారిన పడుతున్నారు. వర్షాకాలంలో నీట మునిగి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ అవసరమని తెలిపారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించకుండా,



అభివృద్ధి చేయకుండా హైదరాబాద్ మూసీ సుందరీకరణ చేయడం వీలుకాదు. దాంతోపాటు ఇతర అభివృద్ధి పనులు ముందుకు వెళ్లలేవన్నారు. తెలంగాణ నుంచి 30 శాతం జనాభా హైదరాబాద్ నగరంలో ఉంటున్నారని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా హైదరాబాద్ నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం నిధుల కేటాయింపులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

# అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వాన్ని వదలం



**ప్రజాభూమి, తెలంగాణ బ్యూరో :**

సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ జితేందర్‌కు గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ కీలక విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేసిన మహమ్మద్ బషీర్, రెహ్మాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తిని స్థానికులు చితక్కొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ వ్యక్తి ఎవరి మాటలు విని గుడిపై దాడి చేశాడో పోలీసులు స్పష్టంగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆలయంపై దాడి చేసిన వారిని రెచ్చగొట్టింది మునావర్ జామా అనే వ్యక్తి.. అతడు ముంబైలో ఉంటాడు. దేశంలో రెండో జాకీర్ నాయక్ కావాలనేది అతడి ఆశయం. దాదాపు 100 నుంచి 150 మందిని మెట్రోపోలీస్ హోటల్లో పెట్టుకుని హిందూ ధర్మం, దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని రాజాసింగ్ గుర్తుచేశారు. అతని పేరును ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పోలీసులు.. ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదో చెప్పాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. 100 నుంచి 150 మందికి పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చి బయటకు పంపించారు కానీ అతన్ని అరెస్ట్ చేయలేదని అన్నారు. బషీర్, రెహ్మాన్‌లు ఇద్దరూ మునావర్ జామా మాటలు వినే అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. జాకీర్ నాయక్ మాటలు విని చాలామంది టెర్రరిస్టులుగా మారారని రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన్ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారు? పోలీసులు ఈ కేసును ఎందుకు లైట్ తీసుకుంటున్నారు? అని సీఎం రేవంత్, డీజీపీ జితేందర్‌ను రాజాసింగ్ అడిగారు. దయచేసి హిందూ దేవాలయాలపై దాడులు చేస్తే నిర్లక్ష్యం వహించొద్దని రిక్వెస్ట్ చేశారు. మీరు లైట్ తీసుకున్నా.. తాము తీసుకోబోమని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.

# మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రిపోర్టు తెప్పించుకున్నామని, బీవోడీ, సీవోడీ ఈ రెండింటిలో కూడా మూసీ ప్రమాదభరితమైన స్థాయిలో ఉందని రిపోర్టు వచ్చిందని చెప్పారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో అక్కడ ఉండే పరిస్థితులను అధ్యయనం చేసి పునరుజ్జీవం, సుందరీకరణ చేసే విధంగా సంకల్పించామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దాదాపు రెండున్నర గంటల పాటు తాను ఏదో విజ్ఞాన ప్రదర్శన చేస్తున్నానని అనుకుని తన పరువు తీసుకున్నారని సెటైర్ వేశారు. ఆయన చెప్పినవన్నీ అవాస్తవాలేనన్నారు.

**సర్వే జరగలేదని ప్రజలే చెబుతుంటే...**

రేవంత్ ప్రభుత్వం మూసీ లూటిఫికేషన్ అని ప్రజలకు అర్థమైపోయిందని కేటీఆర్ అన్నారు. పాపం బయటపడుతుందని చెప్పి రేవంత్ రెడ్డి తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని, మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి సర్వే జరగలేదని స్పష్టం చేశారు. సర్వే జరగలేదని ప్రజలే చెబుతున్నారని కానీ రేవంత్ మాత్రం మూడు నెలల పాటు సర్వే చేస్తున్నామని అబద్ధాలు ఆడుతున్నారన్నారు. ఒక్క మట్టి పెళ్ల కూలగొట్టలేదని రేవంత్ అంటున్నారని కానీ జేసీబీలతో, కూలీలను పెట్టి ఇండ్లు కూలగొడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా వచ్చాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఇండ్లను కూలగొట్టేందుకు వచ్చిన ఓ కూలీ కూడా బాధపడిన



దృశ్యాలు సోషల్ మీడియాలో వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తున్న క్రమంలో గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. లక్షన్నర కోట్ల కుంభణానికి కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. 420 హామీలతో ప్రజల గొంతు కోశారన్నారు. ముఖ్యమంత్రి మూసీ ప్రేమంతా.. ఢిల్లీకి పంపే మూటల కోసమే అని తేలిపోయిందన్నారు.

**అంతమాత్రానికి రూ.1.50 లక్షల కోట్లా...?**

రూ.1,100 కోట్లతో మల్లన్న సాగర్ నుంచి జంట జలాశయాలను లింక్ చేసి గోదావరి జలాలు తరలించే ప్రయత్నం మొదలు పెట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. మూసీలో చేరే ప్రతి చుక్క మురికి నీటిని శుద్ధి చేయడానికి 31 ఎస్టీపీలు నిర్మించామన్నారు. ఎస్టీపీలకు తోడు గోదావరి నీళ్లతో మూసీ పునరుజ్జీవం సాధ్యమవుతుందన్నారు. నగరాన్ని ఈస్ట్ టు వెస్ట్ కలుపుతూ ఎక్స్‌ప్రెస్ వే, ఎస్టీపీలు, గోదావరితో లింక్ ప్రాజెక్టు, నదిపై బ్రిడ్జీలు, వాక్ వేలు, ఓపెన్ జిమ్‌లు, పార్క్ లు సహా అన్ని పనులు చేసేందుకు ఎక్కువలో ఎక్కువ రూ. 25 వేల కోట్లు సరిపోతాయని, అంతమాత్రానికి రూ.1.50 లక్షల కోట్లు ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# కరీంనగర్ బీఆర్ఎస్‌లో కేసుల భయం

**ప్రజాభూమి, తెలంగాణ బ్యూరో :**

కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతలపై నమోదవుతున్న కేసులు ఆ పార్టీ నేతల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు వివాదాస్పద భూముల్లో ఇరుక్కుని జైలు పాలయ్యారు. తాజాగా మేయర్, నగర బిఆర్ఎస్ అధ్యక్షులపై కేసుల నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరీంనగర్ లో రాజకీయ పరిస్థితులు శరవేగంగా మారాయి. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అన్నితామై వ్యవహరించిన నేతలు ఇప్పుడు కేసులతో కలవర పడుతున్నారు. తొలుత కేసులను ఆషామాషీగా భావించిన బీఆర్ఎస్ నేతలు, అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేతలు పోలీసులపై ఒత్తిడి పెంచడంతో గులాబి గూటిలో గుబులు మొదలై హైకోర్టు ఆశ్రయిస్తున్నారు. తమ అనుచరులు పార్టీ నేతలపై కేసుల పట్ల మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆందోళన వ్యక్తం చేస్తూ నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మోహంతిని కలిసి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతల పై కుట్రపూరితంగా కేసులు పెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

**నోటీసులు జారీ..**

బీఆర్ఎస్ నాయకుల పై కేసును నమోదు కావడంతో పాటు అటు పోలీస్ జిల్లా బాస్ సీపీకి, జిల్లా కలెక్టర్ కు ఎస్సీ కమిషన్ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. మేయర్ వ్యవహారంలో కార్పొరేటర్ మెండి శ్రీలత, ఆమె భర్త చంద్రశేఖర్ వరుస ఫిర్యాదులతో ఎస్సీ కమిషన్ ద్వారా సిపి, జిల్లా కలెక్టర్ కు నోటీసులు జారీ కావడం సంచలనంగా మారింది. దళిత వర్గానికి చెందిన కార్పొరేటర్ పట్ల మేయర్ వివక్షత చూపుతూ అవమానించారని రెండు మాసాల క్రితం 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పిర్యాదు పట్ల పోలీసులు సరిగా స్పందించకపోవడంతో శ్రీలత హైకోర్టును ఆశ్రయించడంతో పోలీసులు మేయర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే ఎస్సీ కమిషన్ నుంచి జిల్లా ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేయించారు. దీంతో మేయర్ పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకొని హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. అయితే హైకోర్టు అందుకు నిరాకరించి 41 ఏ సీఆర్పీసీ కింద నోటీసులు మాత్రమే జారీ చేయాలని.. అరెస్టు చేయరాదంటూ పోలీసులకు సూచనలు జారీ చేసింది. మేయర్ అరెస్టుకు కాంగ్రెస్ పార్టీ మొత్తం ఏకతాటిపై నిలిచి ఆయనకు వ్యతిరేకంగా పావులు కదపడం వల్లే మేయర్ సునీల్ రావు హుటాహుటిన హైకోర్టును ఆశ్రయించారని తెలుస్తోంది. మేయర్ వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ లో మరో కీలక నేత నగర పార్టీ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ పై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించే అవకాశం ఉందని తెలుస్తోంది. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజున హరిశంకర్ కులం పేరుతో దూషించారంటూ రాంనగర్ ప్రాంతానికి చెందిన ఒకరు మరుసటి రోజున ఫిర్యాదు చేయడం.. ఎఫ్ ఐ అర్ నమోదు కావడం వెనువెంటనే జరిగింది. అయితే మేయర్ పై కేసుకు సంబంధించి ఎస్సీ కమిషన్ నుంచి నోటీసులు జారీ అయిన క్రమంలో త్వరలోనే చల్లా హరిశంకర్ కేసు గురించి పోలీసులు సత్వర నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాభూమి ప్రతినిధి, బెజ్జంకి:**

ఇల్లంతకుంట మండల పరిధిలోని పత్తికుంటపల్లి లో కాంగ్రెస్ నాయకులు జుట్టు నగేష్ తండ్రి జుట్టు కొమురయ్య ,చింతలపెల్లి శ్రీనివాస్ రెడ్డి తల్లి చింతలపెల్లి లచ్చవ్వ మరణించిగా మృతుల కుటుంబ సభ్యులను శుక్రవారం మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపెల్లి సత్యనారాయణ పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గ్రామశాఖ అధ్యక్షులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ బర్త్ డే వేడుకలు

**బన్సీలాల్ పేట్ ప్రతినిధి, ప్రజాభూమి;**

దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీ బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్ లోకి మార్చే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాష్ట ముదిరాజ్ నాయకులు డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ లు రాజకీయ, సామాజిక, ఉద్యోగ రంగాల్లో మాత్రం వెనకబడి ఉన్నారని వారు అన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలువురు ముదిరాజ్ నేతలు శుక్రవారం ఆయన ఇంటికి వెళ్ళి బర్త్ డే విషేస్ చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బండ ప్రకాశ్ భవిష్యత్ లో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, ప్రజా సేవలో తరంచాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట ముదిరాజ్ సంఘ నాయకులు మర్రి ప్రభాకర్ ముదిరాజ్, పొట్లకాయల వెంకటేశ్వర్లు, ఎం.రవికాంత్, బాలు, ఓయూ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**ప్రజాభూమి ప్రతినిధి, గంగాధర :**



ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని, వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం లేదని, ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ప్రభుత్వం పై మండిపడ్డారు. శుక్రవారం బూరుగుపల్లిలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతుధర తక్కువైనా సరే మిల్లుల వద్దకు ధాన్యం తీసుకెళ్తే అధిక తేమ శాతం ఉన్నదనే పేరుతో రైతులను దోచుకుంటున్నారని,నియోజకవర్గంలో వరి కోతలు మొదలై 20 రోజులు గడుస్తున్న ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని అన్నారు.దీంతో కోసిన ధాన్యాన్ని తక్కువ ధరకు మిల్లులకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన వాపోయారు. కేసీఆర్ పాలనలో నెల రోజుల ముందే వ్యవసాయ మంత్రితో అధికారులతో రివ్యూ మీటింగ్ పెట్టి అందరిని అప్రమత్తం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశామన్నారు.నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో మిల్లర్లు అందినకాడికి దోచుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయని,వాతావరణం అనుకూలించకపోవడంతో చేతికొచ్చిన పంట ఎక్కడ నేలపాలవుతుందోనని రైతులు వడ్లను ఆరబోయలేక కోత నుండి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారని ఇదే అదునుగా భావించిన మిల్లర్ల యజమానులు రైతులు తీసుకెళ్లిన వడ్లకు అధిక తేమ శాతం ఉన్నదని సాకుతో బస్తాకు రెండు నుండి నాలుగు కిలోల వరకు కట్ చేస్తున్నారని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ గిట్టుబాటు ధర రూ.2320 ఉండగా ప్రైవేట్ మిల్లర్లు క్వింటాలుకు రూ.1600 నుండి 2000 వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లుతుందని,ఇంత జరుగుతున్నా సంబంధిత మార్కెటింగ్ అధికారులు తమకేమీ పట్టనట్టు, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సుంకే రవి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేసారు.ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని అయన డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఎన్నికల్లో రైతులు పండించిన పంటకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చిందని, ఎన్నికల హామీలు అమలు చేసి అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని కోరారు.ఇటీవల ప్రభుత్వం సన్నవడ్లకి 500 బోనస్ ఇస్తామని ప్రకటించడం రైతులను మోసం చేసినట్లేనని అన్నారు.మార్కెట్ కు ధాన్యం తెచ్చి 15 రోజులు అవుతుందని, మార్కెట్లో ధాన్యం పోయడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదని, పోసిన ధాన్యం వర్షానికి తడిసిన, ధాన్యం పై కప్పడానికి టార్పాలిన్ లు ఇవ్వలేమని మార్కెట్ అధికారులు అంటున్నారని, రైతులే టార్పాలిన్లు కొనుగోలు చేసుకొని వడ్లపై కప్పుతున్నారని సుంకే రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.వాతావరణం అనుకూలించడం లేదని, ఎప్పుడు వర్షం కురుస్తుందోనని భయం భయంతో రైతులు ఉన్నారన్నారని,ఇప్పటి వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాని వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గాని ఎలాంటి రివ్యూ మీటింగ్ పెట్టలేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖా మంత్రి, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని,రైతాంగాన్ని ఆదుకోవాలని,ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేసారు. లేని పక్షంలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడుతామని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వ్యవసాయ పొలాల వద్ద రెండు ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్ చోరీ

**ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి**



కన్నేశారా చోరీ చేయాల్సిందే...కటిక చీకట్లలోనూ కాపర్ కొట్టేయాల్సిందే.కాదూ కూడదంటే విద్యుత్ వైర్లనయినా దిగమింగేయాల్సిందే.ప్రాణాంతకమని తెలిసినా విద్యుత్ వైర్లతో సయ్యాటలాడతారు. అర్ధరాత్రి మొదలు కోడి కూసే లోపు గప్ చుప్‌గా ఎత్తుకుపోతారు.లక్షలకు లక్షలు పోసి పంట బాగుకు కొన్న రైతులు ఘొల్లుమంటున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామానికి చెందిన కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, వట్టిపల్లి లింగారెడ్డి, చొక్కా రెడ్డి వ్యవసాయ పంట పొలాలు గొట్టమిట్ల గ్రామ శివారులో ఉన్నాయి. వీరి వ్యవసాయ పొలాల వద్ద ఒకే ప్రాంతంలో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తి దోచుకెళ్లారు. గమనించిన ఓగులాపూర్ రైతులు వెంటనే కోహెడ ఎస్ఐ అభిలాష్ కు, విద్యుత్ శాఖ ఏఈకి సమాచారం అందించారు. చిల్లర దొంగలు చేస్తున్న పనులకు అటు వ్యవసాయ పొలాలకు నీళ్లు లేక, పశువులకు నీళ్లు లేక ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుని పశువులకు పెడుతున్నారు. వెంటనే దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అధికారులను పోలీసులను కోరుతున్నారు.

## రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా?

**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్:**



అకాల వర్షాలకు పంట నష్టపోయి రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏంటని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండిపడ్డారు. గురువారం ఆయన మానకొండూర్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ అకాల వర్షాలకు పంటలు నేలకొరిగి, ధాన్యం తడిసి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదనిరసమయి బాలకిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి కోతలు ప్రారంభమై, ధాన్యం కుప్పలుగా పేరుకుపోగా, పంటను వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలిద్దా మంటే ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలు ప్రారం భంచక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అకాల వర్షాలకు భయపడి రైతులు ధాన్యం అమ్ముకోవడానికి దళారులను ఆశ్రయించి ధాన్యం అమ్ముకుంటున్నారని ప్రభుత్వం, ఎమ్మెల్యే వెంటనే రైతుల ఇబ్బందులు, సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంట నే వడ్లు కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి, వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ చూపి అన్ని సెంటర్లలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి వేగవంతం చేయాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వి రామకృష్ణారావుతో పాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**ప్రజాభూమి ప్రతినిధి, గంగాధర :**

మండలంలోని గర్షకుర్తి గ్రామానికి చెందిన మిట్టపల్లి జగన్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఘర్షకుర్తి సభ్యుల సహకారంతో మృతుడి తండ్రికి 8 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించినట్లు అధ్యక్షులు లయన్ మిట్టపల్లి రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ అన్నల్దాస్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఇన్చార్జి లయన్ కొండవేని మల్లికార్జున్ పాల్గొన్నారు.



## రాజన్న ఆలయ ఉద్యోగి బొడుసు మహేష్ కు పదోన్నతి

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ:**

వేములవాడ రాజన్న ఆలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న బొడుసు మహేష్‌కు సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి ఉత్తర్వులు శుక్రవారం రోజు ఆలయ ఈఓ కె. వినోద్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓ శ్రవణ్, పర్యవేక్షకులు పూజిత, సీనియర్ అసిస్టెంట్ పురాణం వంశీ, కూరగాయల శ్రీనివాస్ లు ఉన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి



**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్ :**

ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు కేంద్రం (మహిళా ప్రాంగణం)లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించినట్టు మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం ఉదయం మహిళా శిశు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ప్రాంగణంలోని భవనాలను, ఇటీవల చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లడుతూ మహిళా శిశుకేంద్రంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా వసతి గృహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన అంచనాలను వెంటనే తయారు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అంచనాలను అందజేస్తే ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యా,సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక ఇంజినీర్ అనితా సింగ్నాథ్, సీనియర్ అసిస్టెంట్ సుధా, అకౌంటెంట్ రాజా కిషన్ రెడ్డి, వార్డెన్లు రేణుక, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిపై వీధి కుక్కల దాడి





**ప్రజాభూమి ప్రతినిధి, బెజ్జంకి:**

మండలంలోని చీలాపూర్ పల్లిలో వీధి కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. శుక్రవారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న గజ్జెల రిశిక (5) అనే చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో బాలిక కేకలు వేయడంతో గమనించిన పారిశుద్ధ్య కార్మికుడు గజ్జెల సాంతోష్బాలికను కుక్కల భారీ నుంచి రక్షించడానికి రాగా అతనిపై కూడా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గమనించిన స్థానికులు కుక్కల దాడిలో గాయపడిన ఇరువురిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.. కాగా కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి రిశిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## గన్నేరువరం, జంగపల్లి లో ఎలుగుబంట్లు సంచారం

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం :**



గన్నేరువరం, జంగపల్లి గ్రామాల్లో రాత్రిళ్లు ఎలుగుబంట్లు సంచరించడంతో ఆయా గ్రామస్తులు ,రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం గన్నేరువరం లోని ఎల్లమ్మ గుడి, వడ్లు కొనుగోలు కేంద్రంతో పాటు ఇండ్లకు సమీపంలో ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా జంగపల్లి గ్రామం లోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయం, పెద్దమ్మ దేవాలయం పరిసర ప్రాంతాలతో పాటు, వ్యవసాయ చెట్లు పొదల్లో రాత్రి పూట మూడు ఎలుగుబంట్లు, ఐదు రోజుల నుంచి సంచరిస్తున్నాయని గ్రామస్తులు, రైతులు తెలిపారు. గ్రామస్తుల, ఎలుగుబంట్లు రైతుల పై దాడికి పాల్పడే అవకాశం ఉందని, మండల అధికారులు స్పందించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## దేవాదాయ శాఖ భూముల పరిరక్షణకై గెజిట్ నోటిఫికేషన్

**ప్రజాభూమి ప్రతినిధి, సికింద్రాబాద్:**



దేవాదాయ శాఖ భూముల పరిరక్షణలో భాగంగా స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ ఇస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోని పలు ఆలయాల అభివృద్ధి వివరాలు, భక్తులకు కల్పిస్తున్న వసతుల వివరాలు, దేవాదాయ శాఖ భూముల పరిరక్షణకు చేపడుతున్న చర్యల వివరాలు తెలుపుతూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... దేవాదాయ శాఖకు చెందిన భూములను పరిరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని వివరించారు. 3దేవాదాయ భూములను సర్వే చేసి సైన్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు 34 వేల 92 ఎకరాల దేవాదాయ భూములకు జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని అన్నారు. 57 శాతం దేవాదాయ భూములను ధరణిలో నిక్షిప్తం చేయడంతో పాటు ఇతరలు ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నమన్నారు.

ఆలయాల అభివృద్ధి...

రాష్ట్రంలోని ప్రముఖ ఆలాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాబోయే బ్రహ్మోత్సవాల నాటికి యాదగిరి గుట్ట దేవాలయ గోపురానికి 60 కిలోల బంగారంతో తాపడం చేస్తున్నామన్నారు. దాతల చే సేకరించిన 15 కోట్ల విరాలాలతో ఉచిత అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనివలన రోజుకు సూమారు 2500 మంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందించే వీలు కలుగుతుందని అన్నారు. అదే విధంగా దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలినడక భక్తులకు ఎండ నుండి ఉపశమనం కల్పించేందుకు షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి మాస్టర్ ప్లాన్ లో భాగంగా భూ సేకరణ చేసెందుకు 60 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. వీటితో పాటు వేములవాడ, భాసర వంటి ప్రముఖ ఆలయాల అభివద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో అన్ని దేవాలయాల వెబ్ సైట్ లను ఒకే గొడుగుకిందకు తీసుకు వచ్చి దేవాదాయ శాఖ సమగ్ర వెబ్ సైట్ ను తయారు చేయబోతున్నామన్నారు. త్వరలో దేవాదాయ శాఖ యాప్ ను ఏర్పాటు చేయడంతో పాటు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా భక్తులు తమకు ఇష్టం వచ్చిన దేవాలయాల వివరాలు స్థల పురాణాలు తెలుసుకునే వీలు కల్పిస్తున్నామన్నారు.

**ఉద్యోగుల సంక్షేమం కోసం...**

గత 15 సంవత్సరాలుగా బదిలీలు లేకుండా ఒకే చోట పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు ఉపశమనం కల్పిస్తూ భారీగా భదిలీలు చేపట్టమన్నారు. దేవాదాయ శాఖలోనే ఇది రికార్డు అన్నారు. ప్రెసిడెన్,యల్ ఆర్డర్ 2018 వచ్చిన తర్వాత జోనల్ సిస్టమ్ ప్రకారం సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ను సవరించుకున్నామని అన్నారు. చాలా రోజులగా దేవాదాయ శాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

# పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

## మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 18 (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లాలో 473 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రతి చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తామని, సన్నరకం దాన్యానికి 500 రూపాయల బోనస్ రైతులకు ఇస్తామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. చిన్న శంకరంపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం మండలంలోని సూరారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేను సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి వైస్ చైర్మన్ నగేష్‌లు ఘనంగా సన్మానించారు. సూరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఏపీడి సరస్వతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ దళారుల ను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. మెదక్ జిల్లాలో మొత్తం 473 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. రైతులు పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే నేరుగా తమ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. సన్న రకం దాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2320 బీ గ్రేడ్ రకానికి 2300 క్వింటాలకు చెల్లించడం జరుగుతుందని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, జంగారై సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీడి సరస్వతి, తహశీల్దార్ మన్నన్, డీపీఎం మోహన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, రాజిరెడ్డి, సుధాకర్, గోపాల్‌రెడ్డి, ఎల్లబోయిన బాబు, సురేందర్ నాయక్, జీవన్, రమేష్‌గౌడ్, రాజా సింగ్, అక్బర్, పవన్ గౌడ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నార్సింగి, అక్టోబర్ 18 (ప్రజా భూమి) :**



నార్సింగి మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అధికారులు, ఐకేపీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం రోహిత్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు ధర్నాలు చేసేంత వరకు వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు కారని, తమది ప్రజా ప్రభుత్వం రైతులు ప్రభుత్వం కాబట్టి కోతలు కాక ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుల కోసం 473 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకోవడం జరుగుతుందని, రైతులు దళారులను నమ్మకుండా తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి, పంటకు గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఏ గ్రేడ్ రకానికి 2320 రూ, బీ గ్రేడ్ రకానికి 2300, సన్న వడ్లను ఐదు వందల బోనస్ కూడా రైతులకు అందిస్తారని తెలిపారు. తదనంతరం శేరిపల్లి నివాసి శ్రీరామ్ కృష్ణకు సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీడీవో ఆనంద్, ఐకేపీ ఏపీఎం అశోక్, ఐకేపీ సీసీ శంకర్ యాదవ్, సుల్తానా, వీవోఏ రామచంద్రం యాదవ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తాళ్ళ స్వప్న, మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, శేరిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ళ కృష్ణాగౌడ్, శంకరంపేట్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, నార్సింగి గ్రామ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, మండల నాయకులు అంచనూరి రాజేష్, మనోజ్ కుమార్, తాళ్ల చిన్న కృష్ణ గౌడ్, నర్సింహులు గౌడ్, లక్ష్మి నర్సింహులు, చందూ యాదవ్, కందరి చిన్న బాబు, బాలకృష్ణ గౌడ్, మహిళా సంఘం అధ్యక్షురాలు తాళ్ల స్వప్న, రాచపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

**మెదక్, అక్టోబర్ 18 (ప్రజా భూమి) :**

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి శనివారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా న్యాయమూర్తి లక్ష్మీ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి పాపన్నపేట మండలం నగాసన్‌పల్లి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. ఉదయం 10 గంటలకు అల్లదుర్గం మండల కేంద్రంలోనీ కోర్టు కాంప్లెక్స్ ప్రారంభిస్తారన్నారు. అనంతరం మెదక్ బార్ అసోసియేషన్ తో నిర్వహించే సమావేశంలో పాల్గొనీ, మెదక్ సీఎస్ఐ చర్చ్ ను సందర్శిస్తారని తెలిపారు.

## రాయపోల్ సబ్ స్టేషన్ ఏఈఈగా శ్రీనివాసరావు



**దౌల్తాబాద్, అక్టోబర్ 18( ప్రజా భూమి) :**

ప్రభుత్వ ఉద్యోగ బదిలీలలో భాగంగా రాయపోల్ విద్యుత్ శాఖ ఏఈఈగా శ్రీనివాసరావు శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో తొగుట మండలం ఏఈఈగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు బదిలీపై రాయపోల్ మండలం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్ రైతులకు, గృహ వినియోదారులకు అందించేందుకు కృషి చేద్దామని ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోదారులు, ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి




**మెదక్ అక్టోబర్ 18 (ప్రజా భూమి) :**

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ పట్టణం అవుసులపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అవుసులపల్లికి చెందిన నాగరం శివసాయి (23) గురువారం సాయంత్రం నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామాల్లో వెతికారు. కానీ ఎక్కడ కనిపించలేదు. అర్ధరాత్రి దాదాపు 12 గంటల ప్రాంతంలో ఇంటికి సమీపంలో ఉన్న గడ్డి వాము వద్ద శివసాయి పడుకొని ఉన్నట్టు గుర్తించారు. వెళ్లి లేపే ప్రయత్నం చేయగా కదలిక లేకపోవడంతో వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని ఒంటిపై గాయాలు గమనించిన కుటుంబీకులు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ మురళీ కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.




## ఉద్యోగులకు కరువు భత్యం విడుదల చేయాలి

### టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

**మెదక్, అక్టోబర్ 18 (ప్రజా భూమి) :**

ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వంలోని మూడు విడతలు, నూతన ప్రభుత్వ రెండు విడతల కరువు భత్యాన్ని వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. వీటితో పాటు ఉద్యోగుల నెలసరి భాగస్వామ్యంతో నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, మెడికల్ సిబ్బంది ఎంపిహెచ్ఏ లకు అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పునరుద్ధరించాలని, డిజిటల్ క్రాఫ్ట్ సర్వే నిమిత్తం వ్యవసాయ విస్తరణ అధికారులకు సహాయకులను నియమించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు పల్లె ప్రగతి కి వెచ్చించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, టీఎస్‌జీఎల్ఐ కార్యాలయాన్ని సంగారెడ్డి నుండి మెదక్ పట్టణానికి తరలించాలని తీర్మానాలు జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్ ప్రవేశ పెట్టి ఆమోదింపజేశారు. ఈ నెల 22 న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయంలో ధర్నా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా సహ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఎండీ ఫజలుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్‌కుమార్, రాధా, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

## దసరా బంపర్ ఆఫర్..




**మేడ్చల్, అక్టోబర్ 18 ప్రజా భూమి :**

దసరా ఆఫర్‌లలో మొబైల్ కొనుగోలు చేసిన ఓ యువకుడికి అదృష్టం తలుపు తట్టింది. మేడ్చల్ పట్టణంలోని వాసవి మొబైల్స్ షాపులో రెడ్ మీ, షోమీ వారు కస్టమర్లకు అందుబాటులో ఉంచిన దసరా, దీపావళి ఆఫర్‌లలో చాంద్‌పాషా అనే వ్యక్తి స్క్రాచ్ కార్డు ద్వారా సుమారు రూ.2 లక్షలు విలువచేసే రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ దక్కించుకున్నారు. స్క్రాచ్ కార్డు ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని దక్కించుకునేందుకు ఎంపికైన చాంద్ పాషాకు శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని వాసవి మొబైల్ వేదికగా అన్నపూర్ణ రెడ్‌మీ మొబైల్ డీలర్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విన్నర్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షోమీ డీలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంచిన దసరా దీపావళి ఆఫర్లలో తమ డీలర్ షిప్‌లో కొనుగోలు చేసిన వ్యక్తికి ఈ బహుమతి దక్కడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో షోమీ తెలంగాణ స్టేట్ హెడ్ భాస్కర్, జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్, వాసవి మొబైల్స్ యజమాని దూదారాం, దుకాణ నిర్వాహకులు రమేష్ పాల్గొన్నారు.

## ప్రేమ పెళ్లి చేసుకున్నాడని యువకుడి ఇంటిపై దాడి



**దౌల్తాబాద్, అక్టోబర్ 18( ప్రజా భూమి) :**

యువతి యువకుడు ప్రేమించుకుని ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేసిన సంఘటన రాయపోల్ మండలం టెంకంపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం రాయపోల్ మండలం టెంకంపేట గ్రామానికి చెందిన కోరే మల్లేష్ కుమారుడు కోరే నవీన్, నీల స్వామి పెద్ద కూతురు నీల మాధురి గత కొన్ని రోజులుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి యాదగిరిగుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయం నీల స్వామి కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో కోపోద్రిక్తులై శుక్రవారం తెల్లవారుజామున మైసని రాజు, మైసని ఆంజనేయులు, మైసని మహేష్, మైసని కిష్టయ్య, మైసని స్వరూప, మైసని చిన్న స్వరూప, మైసని రేణుక కోరే మల్లేశం ఇంటిపై కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. మీ కుమారుడిని ఎక్కడ పంపించారో చెప్పాలంటూ ఇంట్లో ఉన్న మల్లేశంపై కూడా దాడి చేశారు. మల్లేశం కుమారుడు నవీన్ ప్రేమ వివాహం చేసుకున్నారని కోపంతో ఇంటిపైన, తనపైన దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరే మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఏఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.



## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

### రాయపోల్ వ్యవసాయ అధికారి నరేష్

**దౌల్తాబాద్, అక్టోబర్ 18( ప్రజా భూమి) :**

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని రాయపోల్ వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంమారక మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలలో రైతులు విత్తనాలు కానీ ఎరువులు కానీ కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయాలు జరిపితే ఉపేక్షించేది లేదన్నారు. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల స్టాక్ రిజిస్టర్ విధిగా నిర్వహించాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు విక్రయించినట్లయితే అటువంటి ఫర్టిలైజర్ డీలర్ల పై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాలు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ఫర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి పెద్దమ్మ గుడిలో చోరీ

**దౌల్తాబాద్, అక్టోబర్ 18ప్రజా భూమి) :**

పెద్దమ్మ ఆలయంలోని గర్భగుడి తాళాలు పగల గొట్టి పెద్దమ్మ, పెద్దిరాజు రాతి విగ్రహాలతో పాటు ఆమ్ప్లిఫైర్ మైక్ సెట్‌ను చోరీ చేసిన సంఘటన రాయపోల్ ఆరేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో ముంగిస్‌పల్లి రోడ్డు మార్గంలో పెద్దమ్మ ఆలయాన్ని నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించుకున్నారు. ఆ ఆలయం సేవకులుగా అదే గ్రామానికి చెందిన కాశమైన అండమ్మ యాదయ్య దంపతులను నియమించారు. గురువారం సాయంత్రం ఆలయంలో పనులు ముగించుకొని ఆలయానికి భద్రంగా తాళం వేసి ఇంటికొచ్చారు. ప్రతిరోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 5:00 గంటల సమయంలో ఆలయాన్ని శుభ్రం చేయడానికి అండమ్మ వెళ్ళింది. ఆలయం బయట శుభ్రం చేసి లోపల శుభ్రం చేసి భక్తి పాటలు పెట్టడానికి మైక్ సెట్ పెడదామని లోపలికి వెళ్లి చూడగా గర్భగుడి తాళాలు పగల గొట్టి పెద్దమ్మ, పెద్దిరాజు రాతి విగ్రహాలతో పాటు, ఆమ్ప్లిఫైర్ మైక్ సెట్ దొంగిలించారు. సుమారు వాటి విలువ రూ.31 వేలు ఉంటుంది. వెంటనే సమాచారం గ్రామస్తులకు ముదిరాజ్ ఫోన్ ద్వారా సమాచారం అందించగా అందరూ వెళ్లి చూసేసరికి ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.





## రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

**డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి**



**శామీర్ పేట్ అక్టోబర్ 18(ప్రజా భూమి):**

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని డీసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, కేశవాపూర్ గ్రామాలలో రైతులతో కలిసి ధాన్యము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అదికారి వెంకట్ రెడ్డి, మండల వ్యవసాయ అదికారి రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య, కార్యదర్శి శోభారాణి, డైరెక్టర్లు భూమి రెడ్డి నర్సింహులు, బిక్షపతి, బాబు సింగ్, ప్రతాప్ రెడ్డి, లక్ష్మాపుర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, మాజీ సర్పంచ్ వెంకటేష్, విష్ణు గౌడ్, నర్సింహులు, ఇంద్రసేన రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పూర్తి చేయాలి



**శామీర్‌పేట్, అక్టోబర్ 18(ప్రజా భూమి):**

మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ నుంచి కొట్యాల వెళ్లే రోడ్డు పనులను అర్ధాంతంగా ఆగిపోయాయని వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకులు క్యాతం మధుకృష్ణ మంత్రి వెంకటరెడ్డిని నగరంలోని చాంబర్లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మాపూర్ గ్రామం నుండి కొట్యాల గ్రామానికి వెళ్లే రోడ్డు చాలా రోజులుగా పెండింగ్ ఉన్నదని, గత ప్రభుత్వంలోనే రోడ్డు అనుమతి వచ్చినప్పటికీ కాంట్రాక్టర్ ఇబ్బంది పెట్టడం వల్ల రోడ్డు పనులు చాలా రోజులుగా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.



# హోం వర్క్ చేయనందుకు మోకాళ్లపై కూర్చోబెట్టారు

## విద్యార్థులపై పాఠశాల ఉపాధ్యాయుల పైశాచికత్వం

**మేడ్చల్, అక్టోబర్ 18 ప్రజా భూమి :**

దసరా పండుగ సెలవుల్లో ఇచ్చిన హోంవర్క్ పూర్తి చేయలేదని విద్యార్థులను చొక్కాలు విప్పించి మోకాళ్లపై కూర్చోబెట్టి హోంవర్క్ రాయించిన ఘటన మేడ్చల్ జిల్లాలో శుక్రవారం జరిగింది.వివరాల్లోకి వెళితే మేడ్చల్ మండల పరిధిలో ఉన్నటువంటి సెయింట్ మేరీస్ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు చొక్కాలు ఇప్పించి మోకాళ్లపై కూర్చోబెట్టి హోంవర్క్ రాయించారు.ఈ దృశ్యాలు మీడియాకు చిక్కాయి.పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు దసరా పండుగ సెలవుల్లో ఇచ్చినటువంటి హోంవర్క్ పూర్తి చేయకపోవడంతో నేడు పాఠశాల ప్రిన్సిపల్ తమకు ఈ పనిష్మెంట్ ఇచ్చినట్లు విద్యార్థులు మీడియాకు చెప్పారు. విశ్వసనీయంగా సమాచారం అందుకొని పాఠశాలకు వెళ్లి కవరేజీ చేస్తున్న మీడియా ప్రతినిధి సెల్ ఫోన్ ను యాజమాన్యం లాక్కునే ప్రయత్నం చేశారు. విద్యార్థులను శిక్షించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అతిక్రమించిన యాజమాన్యంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ తోపాటు పలువురు డిమాండ్ చేస్తున్నారు.. నేడు పాఠశాలను సందర్శించి పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ ఎంఈఓ తెలిపారు.

## అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

**శామీర్ పేట్, అక్టోబర్ 18(ప్రజా భూమి) :**

నిబంధనలకు పాతరేసి ఉపాధ్యాయులకిచ్చిన అక్రమ డిప్యూటేషన్లు ఏ మాత్రం అంగీకారం కావని, తక్షణం వాటిని రద్దు చేయాలని టీఎస్‌యూటీఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాధారణ బదిలీల సందర్భంగా కాన్సిలింగ్ ప్రక్రియలోని సాంకేతిక సమస్యల మూలంగా ఒక పాఠశాలకు బదులు వేరొక పాఠశాలకు కేటాయించబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వందలాది టీచర్ల అప్పీళ్ళను పట్టించుకోకుండా, గాలికోదిలేసి 300 కి.మీ దూరంలో నున్న ములుగు లాంటి జిల్లాల నుంచి మేడ్చల్ జిల్లా కు డిప్యూటేషన్లపై ఎలా తీసుకోస్తారని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకులు పి .మాణిక్ రెడ్డి ప్రశ్నించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. జయసింహా రెడ్డి, మదన్



రెడ్డి, శామీర్ పేట, మూడుచింతలపల్లి, ఘట్కేసర్ మండలంలోని నాయకత్వంతో కలిసి వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పర్యటించి ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. టీచర్ లు ప్రజాప్రభుత్వం అని భావిస్తున్న ప్రస్తుత ప్రభుత్వంపై అక్రమ డిప్యూటేషన్ల వలన టీచర్లు నమ్మకం కోల్పోయే ప్రమాదం వున్నదని ప్రధాన సంపాదకులు పి.మాణిక్యం రెడ్డి, జిల్లా అద్యక్ష కార్యదర్శులు జయసింహా రెడ్డి, మదన్ రెడ్డి, కార్యదదర్శ దేవజ నాయక్, శామీర్ పేట అధ్యక్షుడు పి.తిరుమలేశ, ఎం.తిరుపతయ్య ఒక ప్రకటనలో అన్నారు. బదిలీ అప్పీళ్లను వెంటనే పరిష్కరించి టీచర్‌లకు న్యాయం చేయాలన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శిగా మనోహరాచార్య

**శామీర్‌పేట్, అక్టోబర్ 18(ప్రజా స్వరం ) :**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట తులసి భవన్ ప్రాంతంలో శుక్రవారం జరిగిన సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ సలహాదారు సిహెచ్ఎల్ ఆచార్య, ప్రముఖ సిద్ధాంతి నూతలపాటి వాసు, యాదగిరిగుట్ట ప్రధానార్చకులు లక్ష్మీ నరసింహ ఆచార్య, సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్ పల్లి గ్రామానికి చెందిన ప్రస్తుత నివాస ప్రాంతమైన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్ పేట మండల మజీద్ పుర్ వాస్తవ్యులైన తిరుమల మనోహరాచార్యను సనాతన హిందూ ధర్మ పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు వారు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటినుండి హిందూ ధర్మం గురించి ఎవరు తల తిక్కగా మాట్లాడిన సహించేది లేదని తిరుమల మనోహర్ హెచ్చరించారు.

## డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో హీరో కార్తీక్ ఆర్యన్ సందడి





**మేడ్చల్, అక్టోబర్ 18 (ప్రజా భూమి) :**

ప్రముఖ బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ నటించిన చిత్రం భూల్ భూలయ్యా 3 ప్రమోషన్‌లలో భాగంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించారు .ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్‌లో ఆయనతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్,ఎడిఫై వరల్డ్ స్కూల్ డైరెక్టర్ ఏ.కే.అగర్వాల్ పాఠశాల సిబ్బంది,విద్యార్థుల కలిసితో కార్తీక్ ఆర్యన్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన శాస్త్రీయ,పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్‌లో కార్తీక్ ఆర్యన్ సైతం డ్యాన్స్ స్టెప్స్ వేసి సందడి చేశారు. స్కూల్ డైరెక్టర్ ఎ కె అగర్వాల్ విద్యార్థులతో మాట్లాడుతూ కార్తీక్ ఆర్యన్ కొత్త సినిమా భూల్ భూలయ్యా 3 ప్రమోషన్స్‌లో భాగంగా క్యాంపస్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు.డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో క్రిటికల్ థింకింగ్,క్రియేటివిటీ క్యారెక్టర్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యతనిచ్చే కళలతో పాటు గ్లోబల్ వేదికపైన ఆదరణ పొందుతున్న సమగ్రమైన విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.అత్యాధునిక సౌకర్యాలు విద్యార్థులకు అందిస్తూ సుసంపన్నమైన కళ, సంస్కృతిలో శిక్షణ పెంపొందించే వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.

## రాష్ట్ర స్థాయిల్లో వర్షిత్‌రెడ్డికి మొదటి ర్యాంక్

**శామీర్‌పేట్, అక్టోబర్ 18 (ప్రజా భూమి) :**

మండలంలోని తుర్కపల్లిలోని సెయింట్ మెరీస్ సెంట్రల్ స్కూల్లో గురువారం నిర్వహించిన ఆచార్య చాణక్య బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఒలంపియాడ్ టెస్ట్ పరీక్షలో వర్షిత్ రెడ్డి 8వ తరగతి విద్యార్థి, తన ప్రతిభను ఛాటి రాష్ట్ర స్థాయిల్లో మొదటి ర్యాంకును సొంతం చేసుకున్నాడు. 100కి 98 మార్కులు సాధించాడు. విద్యార్థిని స్కూల్ యాజమాన్యం ఛైర్మన్ తిరుపతి రెడ్డి,



స్కూల్ కరస్పాండెంట్ ఎల్లు వరప్రసాద్ రెడ్డి, స్కూల్ ఇంఛార్జి గ్రేస్ రెడ్డి, గౌసియా, స్కూల్ ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

# ఈవేదిక అత్యున్నత విజ్ఞాన వేడుక

## తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

## సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్ ప్రారంభం

**శామీర్‌పేట్, అక్టోబర్ 18(ప్రజా భూమి) :**

ఇది విద్యాపరమైన ప్రయత్నం మాత్రమే కాదని, ఈ వేదిక అత్యున్నత విజ్ఞాన వేడుకని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్ 2024ను ఆలంకృత రిసార్ట్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్ తెలంగాణలో 9వది, సౌత్ జోన్లో 19వది. ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్ అండ్ బియాండ్' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్ ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ (ఏఓఐ ఎస్ జెడ్) ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ ఈవెంట్ మూడు రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు సహకారం, భాగస్వామ్య అభ్యాస స్ఫూర్తిని పెంపొందించనుందని తెలిపారు. చెవి, ముక్కు, గొంతు స్పెషాలిటీల సంరక్షణ అభివృద్ధికి అంకితమైన నిపుణుల నిబద్ధతకు సంతోషిస్తున్నానని తెలిపారు. ఈఎన్‌టీ విపరీతమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల నైపుణ్యం అసాధారణమని తెలిపారు. ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల సామర్థ్యానికి గుర్తింపు లభించిందన్నారు. ఇప్పుడు న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, తల, మెడ శస్త్రచికిత్స వంటి సూపర్ స్పెషాలిటీలలో పని చేయడానికి అనుమతిస్తున్నారని తెలిపారు. ఈ అభివృద్ధి కేవలం వైద్య పురోగతిని మాత్రమే కాకుండా, ఈ రంగంలోని నిపుణులు తమ వృత్తిలో చూపే నిబద్ధతకు, నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ ముఖ్యమైన వైద్య కేంద్రంగా మారిందన్నారు. భారతదేశం నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా రోగులను ఆకర్షిస్తుందన్నారు. ప్రత్యేకంగా ఈ నగరానికి ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున రోగులు వస్తున్నారని తెలిపారు. ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి అధ్యాపకులు రావడం ఆలోచనల మార్పిడికి ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు. చెవి ద్వారా శబ్దం, ముక్కు ద్వారా సుగంధ మార్గం, గొంతు ద్వారా మాట వ్యక్తమవుతుందని ఒక సంస్కృత శ్లోకాన్ని ఉటంకించారు. ఈ మూడూ జీవితం సారాంశం అన్నారు. సున్నితమైన భాగాలతో పని చేసే ఈఎన్‌టీ నిపుణులు కేవలం శస్త్ర వైద్యులు మాత్రమే కాదని, మన ఇంద్రియాల జీవన నాణ్యతను కాపాడే వారన్నారు. వారానికి ఒకరోజు మీ సేవలను ఉచితంగా అందించడం ద్వారా ఉన్నతమైన వృత్తి నిజమైన స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరమైన వారికి అందుబాటులో ఉండేలా ధరలను గణనీయంగా తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ మాట్లాడుతూ ఈ ఈవెంట్ సాంకేతికత ఈఎన్‌టీ సేవలను ఎలా మారుస్తుందో? అన్వేషించే కీలకమైన పరిస్థితులను సూచిస్తుందన్నారు. ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్య సంరక్షణను విప్లవాత్మకంగా మార్చబోతుందని తెలిపారు. ఈఎన్‌టీ నిపుణుల మధ్య సహకారం, జ్ఞానం పెంపొందించడానికి ఈ సంవత్సరం ఇక్కడ సమావేశమయ్యామని తెలిపారు. రాబోయే రెండు రోజులలో ఓటోలారిన్జాలజీ రంగంలో తాజా పరిశోధనలు, సాంకేతికతలను కవర్ చేసే చర్చలు, ప్రసంగాలు ఉంటాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీ ఈఎన్‌టీ ఫీల్డ్ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో నర్వ్ స్టిమ్యులేషన్ వంటి కొత్త చికిత్సలను ప్రదర్శించడానికి, వివిధ అలర్జీలకు అధునాతన చికిత్సలను చర్చించనున్నారని తెలిపారు. ఈవెంట్ లక్ష్యం, రోగి సంరక్షణను మెరుగుపరచడం, చికిత్సా ఖర్చులను తగ్గించడం ఆధునిక పరిష్కారాలను అందించడం అన్నారు. ఈ సందర్భంగా ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డీ ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణాది ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల సదస్సు ప్రతీ సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో జరుగుతుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇది రెండో సారి అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. మూడు రోజులు జరగనున్న ఈ ఈవెంట్ ఈఎన్‌టీ నిపుణుల మధ్య సహకారం, జ్ఞానాన్ని పంచుకోవడం లక్ష్యంగా ఉంది. తద్వారా నైపుణ్యం, తాజా పురోగతులపై అవగాహన పెరుగుతుంది. వర్క్‌షాపులు, ఉపన్యాసాలు, పరస్పర చర్చలతో కూడిన సమగ్రమైన శిక్షణా అనుభవం లభిస్తుంది. సంప్రదాయ వైద్యం, ఆధునిక సాంకేతికత మధ్య వారధిగా ఈవెంట్ నిలిచింది. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ రంగంలో అతి తక్కువ హానితో శస్త్రచికిత్సలు, సాంకేతిక ఆవిష్కరణలపై చర్చ జరుగుతుంది. ముఖ్యంగా కంటి ద్వారా నిర్వహించిన మెదడు శస్త్రచికిత్సలో వచ్చిన విజయవంతమైన పద్ధతి ఉంటుంది. ఈ మినిమమ్ ఇన్వాసిస్ పద్ధతి కంటి సాకెట్‌లో ఒక చిన్న కోతతో కూడిన ఈ ప్రక్రియ కణజాల నష్టాన్ని తగ్గిస్తుంది. ఇది శస్త్రచికిత్స అనంతర సమస్యలను తగ్గిస్తుంది. రోగులు వేగంగా కోలుకునేలా చేస్తుంది. ఈఎన్‌టీ కేర్‌లో రోబోటిక్ సర్జరీల రాక అజెండాలో మరో విశేషమైన అంశం. ముఖ్యంగా చెవి, ముక్కు, గొంతు, పుర్రె సర్జరీల కోసం ఈ ప్రక్రియలు మొదటిసారి నిర్వహిస్తున్నారు. మానవ చేతులు చేరడం కష్టమైన ప్రాంతాలకు సులభంగా చేరవచ్చు. అసమానమైన కచ్చితత్వాన్ని అందిస్తాయి. రోగి ఫలితాలను మెరుగుపరుస్తాయి. కృత్రిమ మేధస్సు కూడా గణనీయమైన పురోగతిని సాధిస్తుంది. ఇది రోగ నిర్ధారణలో ఎక్కువ కచ్చితత్వం, ప్రామాణీకరణను ప్రోత్సహిస్తుంది. రోగులు స్థిరమైన, విశ్వసనీయమైన సంరక్షణను పొందేలా చూస్తుంది. ఈఎన్‌టీ రుగ్మతలకు ఎలా చికిత్స చేయాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పునర్నిర్మిస్తుంది. ఏఓఐ సౌత్ జోన్ గురించి అసోసియేషన్ ఆఫ్ ఓటోలారిన్జాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ (ఏఓఐ ఎస్జెడ్) అనేది దక్షిణ భారతదేశంలోని ఈఎన్‌టీ సర్జన్ల కోసం ఉన్న వృత్తిపరమైన సంస్థ. ఐదు దక్షిణాది రాష్ట్రాల మధ్య ఐక్యతను కొనసాగించడానికి 2006లో స్థాపించబడింది. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ అసోసియేషన్, వివిధ రాష్ట్రాల మధ్య త్రైవార్షిక (ప్రతి 3 సంవత్సరాలకు) రొటేషన్‌లో పని చేస్తుంది. ఏఓఐ సౌత్ జోన్ 3000 మంది ఈఎన్‌టీ సర్జన్‌లకు జీవిత సభ్యత్వాన్ని కలిగి ఉన్నందుకు గర్వించదగిన సంస్థగా అభివృద్ధి చెందింది. సీఎంఈలు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్స్‌లు, సైంటిఫిక్ ఎగ్జిబిషన్‌లు, పేపర్ ప్రెజెంటేషన్‌ల వంటి వివిధ కార్యక్రమాల ద్వారా పీజీ విద్యార్థులు, జూనియర్ సహోద్యోగుల మధ్య జ్ఞాన మార్పిడిని సులభతరం చేయడం, ఓటురహినోళరైనగలజీలో సైంటిఫిక్ ఎడ్యుకేషన్‌ను అభివృద్ధి చేయడానికి ఏఓఐ సౌత్ జోన్ కట్టుబడి ఉంది. అసోసియేషన్ వార్షిక సమావేశం దక్షిణాది రాష్ట్రాల సభ్యులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని మెరుగుపరచడానికి ఒక సాధారణ వేదికగా పని చేస్తుంది. దేశ, విదేశాల నుంచి ఒటోరినోలారిన్జాలజీలో ప్రఖ్యాత సర్జన్లు, నిపుణులు తమ అంతర్దృష్టులు, నైపుణ్యాలు, టీచింగ్ ప్రోటోకాల్‌లు, పరిశోధన ఆధారిత శిక్షణను ప్రతినిధుల ప్రయోజనం కోసం పంచుకోవడానికి ఆహ్వానించబడ్డారు.



ప్రజాభూమి



# భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 450+ స్కోరు చేయడం ఖాయం: మాజీ క్రికెటర్

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో (IND vs NZ) భారత్ 46 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే. బెంగళూరు పిచ్ తొలుత బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. దీంతో కివీస్ పేసర్లు చెలరేగిపోయారు. టీమ్ఇండియాలో కేవలం రిషభ్ పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ప్రస్తుతం న్యూజిలాండ్ ఇప్పటికే దాదాపు 200 + ఆధిక్యం సాధించింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా భారీ స్కోరు చేస్తేనే టెస్టు ఓటమి నుంచి గట్టెక్కేది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో కనీసం 450కి పైగా పరుగులు చేస్తుందని వ్యాఖ్యానించాడు.

"మ్యాచ్ జరిగేకొద్దీ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతోంది. కివీస్ బ్యాటర్లు మెరుగ్గానే ఆడుతున్నారు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ కనీసం 450కి పైగా పరుగులు చేస్తేనే గెలుపుపై ఆశలు ఉంటాయి. టీమ్ఇండియా సాధిస్తుందని భావిస్తున్నా. గతంలోనూ భారత్‌కు ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి. 2001లో ఆసీస్ పైనే విజయఢంకా మోగించింది. ఫాలోఆన్‌లో పడి మరీ ద్రవిడ్, లక్ష్మణ్ అసామాన్యమైన పోరాటంతో ఆస్ట్రేలియాకు భారీ లక్ష్యం నిర్దేశించింది. ఆ తర్వాత బౌలర్లు చెలరేగిపోయారు. టీమ్ఇండియాను గెలిపించారు. ఇటీవల బంగ్లాపై కాన్పూర్ వేదికగా జరిగిన టెస్టులోనూ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కివీస్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు చేసినంత మాత్రాన అధైర్య పడక్కర్లేదు. అదంతా జరిగిపోయింది. ఇక రెండో ఇన్నింగ్స్ గురించి మాత్రమే ఆలోచించాలి" అని చోప్రా వెల్లడించాడు.

ఆ ముగ్గురిని ఎదుర్కొంటే చాలు..

"తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ పేసర్లు కీలకపాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో పిచ్ స్పిన్‌కు సహకరిస్తుంది. న్యూజిలాండ్ జట్టులో రచిన్ రవీంద్ర, అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌ను ఎదుర్కొని పరుగులు చేయాలి. భారత జట్టులోని 8వ నంబర్ ఆటగాడు కూడా సెంచరీ సాధించిన సందర్భాలు ఉన్నాయి. ఆ స్థానంలో వచ్చే అశ్విన్ కూడా ఆరు శతకాలు బాదాడు. ఈసారి కూడా అలాగే ఆడితే కివీస్ ఎదుట మంచి లక్ష్యం ఉంచడం పెద్ద కష్టమేం కాదు" అని భారత మాజీ క్రికెటర్ వ్యాఖ్యానించాడు.



# భారత్‌కు ఆ రెండు పర్యటనల్లోనే కఠిన సవాలు : గంగూలీ

న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్ కంటే భారత్‌కు మున్ముందు కఠిన సవాలు ఎదురుకానుందని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ వెల్లడించాడు. బహరమ్‌పుర్ స్టేడియంలో ముర్షిదాబాద్ క్రికెట్ అకాడమీని ప్రారంభించిన కార్యక్రమంలో గంగూలీ పాల్గొన్నాడు. ప్రస్తుత భారత జట్టు కుర్రాళ్లు, సీనియర్లతో అద్భుతంగా ఉందని కొనియాడాడు. అయితే, రాబోయే సిరీస్‌లు అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కివీస్‌తో టెస్టు సిరీస్ తర్వాత భారత్ కొద్దిరోజుల్లోనే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా పర్యటనలకు వెళ్లనుంది.

"కొత్త, పాత ప్లేయర్లతో జట్టు ముందుకుసాగుతోంది. మంచి టీమ్ అంటే ఇలానే ఉండాలి. కుర్రాళ్లకు సీనియర్లు సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో భారత్ సిరీస్‌లను ఆడనుంది. ఇవి చాలా క్లిష్టంగా ఉంటాయి. విదేశీ గడ్డపై రాణిస్తే ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం ఇంకా పెరుగుతుంది" అని గంగూలీ తెలిపాడు.

**గంగూలీకి కొత్త బాధ్యతలు**

ఐపీఎల్‌లో దిల్లీ జట్టుకు మెంటార్‌గా వ్యవహరించిన గంగూలీకి కొత్త బాధ్యతలు వచ్చాయి. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. ఐపీఎల్ దిల్లీ జట్టు సహా జేఎస్‌డబ్ల్యూకు చెందిన అన్ని క్రికెటింగ్ కార్యకలాపాలను అతడు చూసుకోవాల్సివుంటుంది. ఐపీఎల్, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో దిల్లీ క్యాపిటల్స్‌కు జేఎస్‌డబ్ల్యూ సహ యజమాని. జీఎంఆర్‌తో కలిసి ఈ ఫ్రాంఛైజీలను నడిపిస్తోంది. ఇప్పుడు దీనికి డైరెక్టర్‌గా గంగూలీ వచ్చాడు. రభ్ గంగూలీ



# మైదానంలోకి రాని రిషభ్ పంత్.. భారత్‌కు షాక్ తప్పదా?

భారత్ న్యూజిలాండ్ జట్ల (IND vs NZ) మధ్య తొలి టెస్టు మూడో రోజు ఆట ప్రారంభమైంది. అయితే, టీమ్ఇండియాకు ఓ విషయంలో భారీ షాక్ తప్పేలా లేదు. రెండోరోజు వికెట్ కీపింగ్ చేస్తూ గాయపడిన స్టార్ ఆటగాడు రిషభ్ పంత్ మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. మూడోరోజు కూడా పంత్ వికెట్ కీపింగ్‌కు రాలేదు. దీంతో అతడి గాయం పరిస్థితిపై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఏమైందనే ప్రశ్నలూ తలెత్తాయి. బీసీసీఐ కూడా స్పందించింది. తమ వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని.. అతడు మళ్లీ మైదానంలోకి దిగేందుకు కృషి చేస్తోందని వెల్లడించింది. పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్‌ను కొనసాగిస్తున్నాడు.

**అసలేమైందంటే?**

రెండోరోజు ఆటలో జడేజా వేసిన ఇన్నింగ్స్ 37వ ఓవర్ చివరి బంతి తక్కువ ఎత్తులో వచ్చి పంత్ కుడి మోకాలికి బలంగా తగిలింది. నొప్పితో విలవిల్లాడి మైదానంలోనే కుప్పకూలాడు. ఫిజియో వచ్చి పరీక్షించి అతన్ని సిబ్బంది సాయంతో బయటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడిన పంత్ కుడి మోకాలికి శస్త్రచికిత్స జరిగింది. ఇప్పుడు అక్కడే బంతి నేరుగా తాకింది. దీంతో మైదానం వీడి వెళ్లిపోయాడు.

**బ్యాటింగ్‌కు దిగకపోతే నష్టమే..**

తొలి ఇన్నింగ్స్‌లో పంత్ టాప్ స్కోరర్. భారత్ చేసిన 46 పరుగుల్లో పంత్ 20 రన్స్ కొట్టాడు. ఒకవేళ రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా భారీ స్కోరు సాధించాలంటే రిషభ్ పంత్ కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. మిడిలార్డర్‌లో దూకుడుగా ఆడే పంత్ ఒకవేళ బ్యాటింగ్‌కు దిగకపోతే భారత్‌కు నష్టమే. అయితే, రెండో ఇన్నింగ్స్ నాటికి అతడు కాస్త కోలుకొని వస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. అదే సమయంలో 'పంత్ విషయంలో మేం రిస్క్ తీసుకోదల్చుకోలేదు' అని కెప్టెన్ రోహిత్ వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కివీస్‌తో మరో రెండు టెస్టులతోపాటు ఆసీస్ పర్యటన ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ కోసం మేనేజ్‌మెంట్ రిస్క్ తీసుకోకపోవచ్చనే వార్తలూ వినిపిస్తున్నాయి.



# ఆస్ట్రేలియా ఔట్

మహిళల టీ20 ప్రపంచకప్‌లో సంచలనం. ఆరుసార్లు ఛాంపియన్, తిరుగులేని ఫేవరెట్ ఆస్ట్రేలియాకు ఘోరపరాభవం. ఏడో టైటిల్‌పై కన్నేసిన ఆ జట్టు సెమీస్‌లోనే ఇంటిముఖం పట్టింది. గురువారం జరిగిన పోరులో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన దక్షిణాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించి, తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మొదట ఆస్ట్రేలియా 5 వికెట్లకు 134 పరుగులు చేసింది. బెత్ మూనీ (44; 42 బంతుల్లో 2×4) టాప్‌స్కోరర్. ఎలిస్ పెర్రీ (31; 23 బంతుల్లో 2×4), తాలియా (27; 33 బంతుల్లో 3×4) రాణించారు. అయబోంగా ఖకా (2/24) కంగారూలకు కళ్లెం వేసింది. అనెకె బాష్ (74 నాటౌట్; 48 బంతుల్లో 8×4, 1×6) మెరుపు ఇన్నింగ్స్‌తో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది.

ఛేదనలో అయిదో ఓవర్లోనే ఓపెనర్ బ్రిట్స్ (15)ను దక్షిణాఫ్రికా కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ వోల్వార్ట్ (42; 37 బంతుల్లో 3×4, 1×6) అండగా నిలవగా.. బాష్ చెలరేగిపోయింది. అడపాదడపా బౌండరీలు బాదేస్తూ జట్టును వేగంగా లక్ష్యం దిశగా తీసుకెళ్లింది. వోల్వార్ట్, బాష్ రెండో వికెట్‌కు 65 బంతుల్లో 96 పరుగులు జోడించారు. 15వ ఓవర్లో జట్టు స్కోరు 121 వద్ద వోల్వార్ట్ వెనుదిరిగింది. కానీ అప్పటికే దక్షిణాఫ్రికా విజయం ఖాయమైంది. ట్రయాన్ (1 నాటౌట్)తో కలిసి బాష్ లాంఛనాన్ని పూర్తి చేసింది. టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై గెలవడం దక్షిణాఫ్రికాకు ఇదే తొలిసారి. బాష్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికైంది.

సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: 134/5 (మూనీ 44, పెర్రీ 31, తాలియా 27, లిచ్‌ఫీల్డ్ 16 నాటౌట్; ఖకా 2/24, మరిజేన్ కాప్ 1/24); దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: 17.2 ఓవర్లలో 135/2 (బాష్ 74 నాటౌట్, వోల్వార్ట్ 42, బ్రిట్స్ 15; అనాబెల్ సదర్లాండ్ 2/26)

# క్వార్టర్స్‌లో సింధు



డెన్మార్క్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 1821, 2112, 21 16తో నాలుగో సీడ్ హాన్ యూ (చైనా)పై విజయం సాధించింది. 63 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సింధు గొప్పగా పుంజుకుని ప్రత్యర్థిని చిత్తుచేసింది. నువ్వానేనా అన్నట్లు సాగిన తొలి గేమ్‌లో సింధుపై హాన్ పైచేయి సాధించింది. రెండో గేమ్‌లో సింధు చెలరేగింది. మూడో గేమ్ 16 పాయింట్ల వరకు స్కోరు సమమవుతూ వెళ్లింది. ఈ సమయంలో ఒక్కసారిగా గేరు మార్చిన సింధు వరుసగా 5 పాయింట్లతో హాన్ పోరాటానికి తెరదించింది. హాన్‌పై తన గెలుపోటముల రికార్డును 71తో సింధు మరింత మెరుగుపరుచుకుంది.




# బెంగళూరులో షమీ.. బ్యాండేజీతోనే బౌలింగ్ ప్రాక్టీస్!

స్టార్ పేసర్ మహ్మద్ షమీ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో మెరిశాడు. అతడికి గాయమైంది కదా..? అక్కడేం చేస్తున్నాడనే అనుమానం కలగడం సహజమే. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు రెండో రోజు ఆట ముగిశాక.. నెట్స్‌లో షమీ బౌలింగ్ చేస్తూ కనిపించాడు.

మోకాలిలో వాపు కారణంగా ఆటకు దూరమైన సంగతి తెలిసిందే. ఎన్‌సీఏలో ఉంటూ సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో బ్యాండేజీతోనే బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. వందశాతం ఫిట్‌నెస్ ఉన్న బౌలర్‌గానే బంతులను వేసినట్లు కథనాలు వస్తున్నాయి. ఎన్‌సీఏలో తన ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాడని.. కోలుకుంటున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. నెట్స్‌లోనూ తొలుత తక్కువ రన్నప్‌తో నెమ్మదిగా వేయడం ప్రారంభించాడని.. వేగం పెంచుకుంటూ వెళ్లాడని తెలిసింది. ఎన్‌సీఏ బౌలింగ్ కోచ్ ట్రాయ్ కూలే సమక్షంలో బౌలింగ్‌ను ప్రాక్టీస్ చేస్తున్నాడు.

**త్వరలోనే వచ్చేస్తాడా?**

గతేడాది వన్డే ప్రపంచ కప్ తర్వాత షమీ తన మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దాదాపు ఎనిమిది నెలల పాటు ఆటకు దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌కైనా అందుబాటులోకి వస్తాడని అంతా అనుకున్నారు. ఆలోపు దేశవాళీ క్రికెట్‌లో ఆడి ఫిట్‌నెస్, ఫామ్ నిరూపించుకుందామని భావించిన షమీకి షాక్ తగిలింది. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలిలో నొప్పిగా అనిపించడంతో వైద్యబృందాన్ని కలిశాడు. శస్త్రచికిత్స చేయించుకున్న ప్రదేశంలో వాపు వచ్చినట్లు గుర్తించారు. దీంతో అతడిని ఆస్ట్రేలియా సిరీస్‌కు తీసుకెళ్లడం కష్టమేనని కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇప్పుడు ప్రాక్టీస్ చేస్తుండటంతో ఎలాగైనా జాతీయ జట్టులోకి రావాలనే ఉద్దేశంతో షమీ ఉన్నట్లు తెలుస్తోంది.

# మెదడును మించిన మేధస్సు!



రోజురోజుకీ కృత్రిమ మేధ (ఏఐ) శరవేగంగా విస్తరిస్తోంది. మనిషి మెదడులా ఆలోచిస్తూ, మనిషి మెదడునే మించుతూ ఎన్నో రంగాలకు చేదోడుగా నిలుస్తోంది. వైద్యం దగ్గరి నుంచి సైన్స్ వరకూ పరిశోధనల పురోగతికి తోడ్పడుతోంది. మానవాళి ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు, సవాళ్లకు పరిష్కారాలు చూపుతోంది. రోజువారీ జీవితాన్ని సులభతరం చేస్తోంది. ఇంత ప్రాచుర్యం పొందుతున్న కృత్రిమ మేధలో అత్యంత కీలకమైంది ఆధునిక మెషిన్ లెర్నింగ్. దీనికి తోడ్పడుతోంది ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్. వీటికి వీలు కల్పించే మూల ఆవిష్కరణల సృష్టికర్తలైన జాన్ జె. హాప్‌ఫీల్డ్, జెఫ్రీ ఇ. హింటన్‌కు ఈసారి ఫిజిక్స్‌లో నోబెల్ బహుమతి లభించింది. ఇంతకీ న్యూరల్ నెట్‌వర్క్ అంటే? ఇది మెషిన్ లెర్నింగ్‌కు ఎలా తోడ్పడుతుంది? ఏవిధంగా ఉపయోగపడుతుంది? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో న్యూరల్ నెట్‌వర్క్ ఒక విధానం. ఇదొక రకమైన మెషిన్ లెర్నింగ్ ప్రక్రియ. దీన్ని డీప్ లెర్నింగ్ అనీ పిలుచుకుంటారు. కంప్యూటర్లకు డేటాను ప్రాసెస్ చేయటాన్ని నేర్పించే దీన్ని మన మెదడు స్ఫూర్తితోనే రూపొందించారు. మనిషి మెదడును పోలిన పొరల పొరల నిర్మాణంలో అంతర్గతంగా అనుసంధానమైన నోడ్స్ లేదా న్యూరాన్స్ సాయంతో పనిచేస్తుంది. కంప్యూటర్లు తాము చేసిన తప్పుల నుంచి నేర్చుకోవటానికి, మరింత మెరుగు పడటానికి తోడ్పడే అనుసార వ్యవస్థను ఇది సృష్టిస్తుంది. దీని మూలంగానే కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌లు సంక్లిష్ట సమస్యలను పరిష్కరించటం సాధ్యమవుతోంది. డాక్యుమెంట్ల సారాంశాన్ని సృష్టించటం, ముఖాలను గుర్తించటం వంటి పనులు తేలికవుతున్నాయి.

**ఏంటీ వీటి ప్రాముఖ్యం?**

మానవ వనరులు అంతంతగా ఉన్నా కంప్యూటర్లు తెలివైన నిర్ణయాలు తీసుకోవటానికి న్యూరల్ నెట్‌వర్క్‌లు తోడ్పడతాయి. ఎందుకంటే ఇవి సంక్లిష్ట, క్రమ రహితమైన ఇన్‌పుట్, అవుట్‌పుట్ డేటాల మధ్య సంబంధాన్నీ గ్రహించగలవు. దానికి అనుగుణంగా తమను తాము తీర్చుదిద్దుకోగలవు. దీని సాయంతో అసమంజస డేటాను అర్థం చేసుకొని, ఒక సాధారణ అభిప్రాయానికి రాగలవు. ఒకే అర్థం గల రెండు వేర్వేరు ఇన్‌పుట్ వాక్యాలనూ గుర్తించగలవు. ఉదాహరణకు అతడికి ఎలా చెల్లించాలో చెప్పగలవా? నేను డబ్బును ఎలా పంపించాలి? అని రెండు ప్రశ్నలను వేశామనుకోండి. ఈ రెండూ ఒకే అంశానికి చెందిన వాక్యాలని న్యూరల్ నెట్‌వర్క్ తెలుసుకుంటుంది.

**ఎలా పనిచేస్తాయి?**

ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ అనేవి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లు లేదా ఆల్గోరిథమ్‌లు. ఇవి ప్రధానంగా కంప్యూటింగ్ వ్యవస్థల సాయంతో గణిత లెక్కలను పరిష్కరిస్తాయి. మన మెదడు మాదిరిగానే 'ఆలోచిస్తూ', పని చేస్తాయి. మన మెదడులోని నాడీ కణాలు ఒకదాంతో మరోటి అనుసంధానమై సంక్లిష్ట, అత్యంత గాఢ బంధాలను ఏర్పరచుకుంటాయి. ఇవి ఒకదానికి మరోటి విద్యుత్ సంకేతాలను పంపించుకుంటాయి. దీని మూలంగానే మనం సమాచారాన్ని విడమరచుకుంటున్నాం. ఆయా విషయాలను గ్రహిస్తున్నాం, నేర్చుకుంటున్నాం. తప్పొప్పులను గ్రహించి మెరుగుపరచుకుంటున్నాం. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లూ అచ్చం ఇలాగే ప్రవర్తిస్తాయి. వీటిల్లోని కృత్రిమ నాడీ కణాలు.. అంటే సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్ ఒకదాంతో మరోటి అనుసంధానమై సమస్యలను పరిష్కరిస్తాయి. ఈ మాడ్యూల్స్‌ను నోడ్స్ అనీ అంటారు. వీటి సాయంతో మామూలు న్యూరల్ నెట్‌వర్క్ ఎలా పనిచేస్తుందో చూద్దాం.

ముందుగా బయటి ప్రపంచం నుంచి ఇన్‌పుట్ లేయర్ ద్వారా సమాచారం లోపలికి వస్తుంది. ఇన్‌పుట్ నోడ్స్ ఈ డేటాను వర్గీకరించి, విశ్లేషించి తర్వాత లేయర్‌కు చేరవేస్తాయి.

ఇన్‌పుట్ లేయర్ నుంచి వచ్చిన డేటాను బోలెడన్ని అదృశ్య (హిడెన్) లేయర్లు ఒకదాని తర్వాత మరోటి సునిశితంగా విశ్లేషించుకుంటూ వస్తాయి. అలా అలా తర్వాతి లేయర్లకు పంపిస్తాయి. న్యూరల్ నెట్‌వర్క్ ప్రాసెస్ చేసిన మొత్తం డేటా తుది ఫలితాన్ని అవుట్‌పుట్ లేయర్ అందిస్తుంది. ఇందులో ఒకటి లేదా ఎక్కువ సంఖ్యలో నోడ్స్ ఉండొచ్చు.

**ఎలా ఉపయోగపడతాయి?**

వివిధ రంగాల్లో, పరిశ్రమల్లో న్యూరల్ నెట్‌వర్క్స్ ఇప్పటికే ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి పనితీరును చూస్తే ఎవరైనా అబ్బురపడాల్సిందే. ఉదాహరణకు.. ఎక్స్‌రే, స్కాన్ వంటి ఇమేజ్‌లను చూసి జబ్బులను నిర్ధరిస్తున్నాయి. అదీ చాలా కచ్చితంగా. సామాజిక ధోరణులను వర్గీకరించటం, వడపోయటం.. ప్రవర్తన డేటాను విశ్లేషించటం ద్వారా ఎవరికి ఏయే వస్తువులు, సరకులు అవసరమో సూచిస్తున్నాయి. పెట్టుబడులు, పొదుపుల వంటి సాధనాల చరిత్రను విశ్లేషించి ఆర్థికపరమైన అంచనాలు వేస్తున్నాయి. వస్తువుల నాణ్యతను పసిగడుతున్నాయి, పర్యవేక్షిస్తున్నాయి. రసాయన మిశ్రమాలను గుర్తిస్తున్నాయి.

**వివిధ విధాలుగా..**

**న్యూరల్ నెట్‌వర్క్స్ రకరకాల రూపాల్లో ఉపయోగపడతాయి. కొన్ని ఇవీ..**

**కంప్యూటర్ విజన్:** ఇది ఇమేజ్‌లు, వీడియోల నుంచి కంప్యూటర్లు ఆయా విషయాలను, సమాచారాన్ని సంగ్రహించటానికి తోడ్పడుతుంది. ఇవి న్యూరల్ నెట్‌వర్క్స్ సాయంతో మనుషుల మాదిరి ఇమేజ్‌లను పోల్చుకోగలవు, తేడాను గుర్తించగలవు. స్వయంచాలిత వాహనాలు మార్గ సూచికలను, ఇతర వాహనాలను గుర్తించటంలో కంప్యూటర్ విజనే కీలకం. ఇమేజ్ లేదా వీడియోల నుంచి అనుచిత, అసురక్షిత కంటెంట్‌ను తమకు తామే తొలగించగలవు. గూగుల్ ఫొటోస్‌లో సేఫ్ సెర్చ్ చేస్తున్నప్పుడు భయానక, అశ్లీల దృశ్యాల వడపోతను గమనించే ఉంటారు. నేరగాళ్లను పట్టుకోవటానికి ముఖాలను గుర్తించే పరిజ్ఞానానికీ ఇదే ఆధారం.

**స్పీచ్ రికగ్నిషన్:** ధ్వని, స్థాయి, భాష, యాసలో తేడాలున్నా కూడా న్యూరల్ నెట్‌వర్క్స్ మనుషుల మాటలను విశ్లేషించగలవు. అమెజాన్ అలెక్సా వంటి వర్చువల్ అసిస్టెంట్లు, ఆటోమేటిక్ ట్రాన్స్‌కిప్షన్ సాఫ్ట్‌వేర్స్ దీన్నే ఉపయోగించుకుంటాయి. ఉదాహరణకు కాల్స్‌ను తమకు తామే వర్గీకరించి కాల్‌సెంటర్ ఏజెంట్లకు తోడ్పడతాయి. డాక్టర్లు చెప్పే విషయాలను అప్పటికప్పుడు డాక్యుమెంట్ రూపంలోకి మారుస్తాయి. వీడియోలు, రికార్డు చేసిన మీటింగుల సబ్‌టైటిల్స్‌ను కచ్చితంగా చూపిస్తాయి.

**నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్:** కంప్యూటర్ వంటి పరికరాలు నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ) సాయంతో టెక్స్‌ట్‌ను విడమరచు కోవటంలోనూ న్యూరల్ నెట్‌వర్క్స్ పాత్రే కీలకం. టెక్స్ట్ డేటా, డాక్యుమెంట్ల నుంచి కంప్యూటర్లు సమాచారాన్ని గ్రహించుకోవటం, అర్థం చేసుకోవటంలో ఇవి సాయం చేస్తాయి. ఆటోమేటెడ్ వర్చువల్ ఏజెంట్లు, ఛాట్‌బాట్స్ ఉపయోగించుకునేది నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ప్రక్రియనే. ఇది ఈమెయిళ్ల వంటి సుదీర్ఘ సంప్రదింపులను విశ్లేషించి వ్యాపార, వాణిజ్య సంస్థలకు తోడ్పడుతుంది కూడా. సెంటిమెంట్‌ను సూచించే కీలక పదబంధాల జాబితా రూపొందించగలదు. సామాజిక మాధ్యమాల్లో సానుకూల, ప్రతికూల కామెంట్లను గుర్తించటం దీనికి ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఛాట్‌జీపీటి వంటి వాటిల్లో ఏదైనా ఒక అశం మీద కథనం రాయమని చెబితే క్షణాల్లో ముందుంచుతుంది కదా. ఇదీ ఎన్ఎల్‌పీ చలవే. పెద్ద డాక్యుమెంట్ల సారాంశాన్ని గుది గుచ్చటానికీ ఇదే ఆధారంగా నిలుస్తోంది.

**డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లో..**

డీప్ న్యూరల్ నెట్‌వర్క్ లేదా డీప్ లెర్నింగ్ నెట్‌వర్క్‌లోనైతే కోట్లాది నోడ్‌స్‌తో కూడిన అదృశ్య లేయర్లు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఒక నోడ్‌కు, మరోదానికి గల అనుసంధానాలను నంబర్ (వెయిట్)తో సూచిస్తారు. ఒక నోడ్ మరోదాన్ని ప్రేరేపిస్తే పాజిటివ్ నంబర్‌గా, అణచివేస్తే నెగెటివ్ నంబర్‌గా పరిగణిస్తారు. ఎక్కువ వెయిట్ గల నెట్‌వర్క్‌లు ఇతర నోడ్స్ మీద మరింత ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. సాధారణంగా డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లు ఎలాంటి ఇన్‌పుట్ రకాన్నయినా అవుట్‌పుట్‌గా మార్చగలవు. అయితే ఇతర మెషిన్ లెర్నింగ్ మోడళ్లతో పోలిస్తే వీటికి మరింత ఎక్కువ శిక్షణ అవసరం. మామూలు నెట్‌వర్క్ శిక్షణకు వేలాది డేటా నమూనాలు అవసరమైతే డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లకు లక్షలాది నమూనాలు కావాల్సి ఉంటుంది.

**రికమండేషన్ల సాధనాలు:** యూట్యూబ్‌లో ఏదైనా వీడియోను చూస్తే తర్వాత అలాంటి వీడియోల సూచనలు కనిపించటం గమనించే ఉంటారు. దీనికి మూలం న్యూరల్ నెట్‌వర్క్‌లే. ఇవి యూజర్ల యాక్టివిటీని గమనిస్తూ, ఎవరికి ఏయే అంశాలు నచ్చుతాయో వాటిని సిఫారసు చేస్తాయి. యూజర్లందరి ప్రవర్తననూ విశ్లేషించి, ఆయా వ్యక్తులకు నచ్చిన ఉత్పత్తులు లేదా సేవలను గుర్తించగలవు కూడా. ఉదాహరణకు ఫిలడెల్ఫియాకు చెందిన క్యురలేట్ అనే అంకుర సంస్థ సామాజిక మాధ్యమాల పోస్టులను అమ్మకాలుగా మలచుకోవటానికి కంపెనీలకు తోడ్పడుతోంది.



## వాట్సప్ కాల్ లింక్ షేర్ తేలికగా..

బృంద, వ్యక్తిగత ఛాట్స్‌లో వీడియో, ఆడియో కాల్స్‌ను త్వరగా షేర్ చేయటానికి వాట్సప్ కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తోంది. గూగుల్ మీట్, జూమ్‌లో మనం వీడియో సమావేశాల లింక్ మీద క్లిక్ చేసి, ఇతరులతో జాయిన్ అవుతాం కదా. వాట్సప్ కొత్త ఫీచర్ కూడా ఇలాగే పనిచేస్తుంది. నిజానికి ఆడియో, వీడియో కాల్స్ షేరింగ్ సదుపాయం వాట్సప్‌లో ఇప్పటికే ఉంది. కాకపోతే ఇదో పెద్ద తతంగంలా అనిపిస్తుంది. ముందుగా కాల్స్ ట్యాబ్‌లకి వెళ్లి క్రియేట్ కాల్ లింక్ ద్వారా కాల్ టైప్‌ను ఎంచుకొని, తర్వాత ప్లస్ మీట మీద తాకాల్సి ఉంటుంది. ఇప్పుడిది సులభం కానుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ బీటా టెస్టర్లకు అందుబాటులో ఉంది. త్వరలోనే విస్తృతంగా అందుబాటులోకి రానుంది. మరి దీన్నెలా వాడుకోవాలి?

- **ముందుగా కనెక్ట్ కావాలనుకునే బృంద లేదా వ్యక్తిగత ఛాట్‌ను ఓపెన్ చేయాలి.**
- **కింద బార్ మీదుండే అటాచ్‌మెంట్ గుర్తును నొక్కి, కాల్ లింక్‌ను తాకాలి.**
- **అప్పుడు ఆడియో లేదా వీడియో కాల్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇష్టమైనది ఎంచుకోవాలి.**
- **అనంతరం ఆకుపచ్చ రంగులో కనిపించే లింక్ బటన్‌ను నొక్కితే అది అవతలివారికి చేరుతుంది.**

ఇతరులకు కాల్ లింక్‌ను పంపించినప్పుడు ఇద్దరూ జాయిన్ కాల్‌ను నొక్కితేనే మాట్లాడుకోవటం మొదలవుతుందని గుర్తించాలి. గ్రూప్ కాల్స్‌కూ ఇదే వర్తిస్తుంది. అటాచ్‌మెంట్ మెనూలోని కొత్త కాల్ లింక్ బటన్ తేలికగా వాడుకోవటానికి వీలుంటుంది. అందువల్ల ఎక్కువమంది యూజర్లకు నచ్చుతుందని భావిస్తున్నారు.


**లో లైట్ మోడ్ కూడా**

వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు వీడియో కాల్స్ మాట్లాడుకోవటానికి వీలు కల్పించే లో లైట్ మోడ్‌నూ వాట్సప్ తీసుకొచ్చింది. వీడియో కాల్స్‌లో బ్యాక్‌గ్రౌండ్, ఫిల్టర్లను యాడ్ చేయటానికి ఇటీవల పరిచయం చేసిన అప్‌డేట్స్‌లో ఇదొక ఫీచర్. ఐఓఎస్, ఆండ్రాయిడ్ రెండు వర్షన్ల మీదా అందుబాటులో ఉంటుంది. కాకపోతే వెబ్ యాప్‌నకు ఇంకా వర్తింప జేయలేదు.

**దీన్ని వాడుకోవటమెలా?**

- **వాట్సప్ ఓపెన్ చేయాలి.**
- **వీడియో కాల్‌కు కనెక్ట్ కావాలి.**
- **కాల్ మాట్లాడుతున్నప్పుడు పైన కుడిమూలన కనిపించే బల్బ్ గుర్తు మీద తాకాలి.**
- **ఒకవేళ నప్పదని అనుకుంటే లో లైట్ మోడ్‌ను ఆఫ్ చేసుకోవచ్చు.**

## కొత్తకొత్తగా యూట్యూబ్



క్రియేటర్ల సృజనాత్మక భావ వ్యక్తీకరణను దృష్టిలో పెట్టుకొని యూట్యూబ్ సరికొత్త ఫీచర్లను తీసుకొస్తోంది. ఇటీవల జరిగిన 'మేడ్ ఆన్' కార్యక్రమంలో వీటిని ప్రకటించింది. ఈ ఫీచర్ల మూలంగా కృత్రిమ మేధ (ఏఐ) మోడల్‌తో స్వల్ప నిడివి వీడియో క్లిప్స్, షార్ట్స్ కోసం బ్యాక్‌గ్రౌండ్‌ను సృష్టించుకోవటం సాధ్యం కానుంది. యూట్యూబ్ స్టుడియోలో ఇన్‌స్పిరేషన్ ట్యాబ్ ద్వారా కంటెంట్ క్రియేటర్లు ఏఐ బాట్‌ను అడిగి వీడియో ఐడియాలు, టైటిళ్లు, థంబ్‌నెయిల్స్, అవుట్‌లైన్స్ కోసమూ సలహాలు, సూచనలు పొందొచ్చు. ఈ కొత్త ఫీచర్ల మీద ఓ కన్నేద్దామా.

**ఏఐ షార్ట్స్:** యూట్యూబ్ షార్ట్స్ కోసం 6 సెకండ్ల నిడివి గల వీడియోలను సృష్టించే ఏఐ మోడల్ అందుబాటులోకి రానుంది. గూగుల్‌కు చెందిన వియో అనే డీప్‌మైండ్ దీన్ని రూపొందించింది. వీడియోలను పోస్ట్ చేసే ముందు అందులో ఏదైనా తక్కువైందని అనిపించినప్పుడు ఇది తోడ్పడుతుంది. అప్పటికే తీసిన వీడియోకు సరిగ్గా సరిపోయే క్లిప్‌ను సృష్టించటం దీని ప్రత్యేకత. ఈ క్లిప్స్ మీద సింథ్ఐడీ అనే వాటర్‌మార్క్ కూడా కనిపిస్తుంది.

**డ్రీమ్ స్క్రీన్:** షార్ట్స్ కోసం బ్యాక్‌గ్రౌండ్లను జనరేట్ చేసుకోవటానికిది సాయం చేస్తుంది. వియోతో అప్‌గ్రేడ్ చేసుకొని ఏఐ జనరేటెడ్ వీడియో బ్యాక్‌గ్రౌండ్లనూ సృష్టించుకోవచ్చు. కాకపోతే వీటిని వాడుకోవటానికి ఈ సంవత్సరం చివరి వరకూ వేచి చూడాలి.

**కమ్యూనిటీస్:** యూట్యూబ్ క్రియేటర్ల ఛానెల్‌లో ఇదో కొత్త విభాగం. ఇందులో క్రియేటర్లు, అభిమానులు కలిసి వీడియోల మీద చర్చించుకోవచ్చు. ప్రస్తుతానికిది కొంతమంది క్రియేటర్లకే అందుబాటులో ఉంది. మున్ముందు దీన్ని ఎక్కువమందికి విస్తరించనున్నారు.

**హైప్:** క్రియేటర్లు పోస్ట్ చేసిన వీడియోలను ఒక్క ట్యాప్‌తోనే ఆకాశానికి ఎత్తేయటానికి (హైప్) తోడ్పడే ఫీచర్. వీడియో దిగువన లైక్ మాదిరిగానే హైప్ బటన్ కనిపిస్తుంది. హైప్స్ సంఖ్య పెరుగుతున్నకొద్దీ టాప్ 100 హైప్డ్ వీడియోల జాబితాలో పైకి చేరుకుంటుంది. యూజర్లు వారానికి మూడు సార్లు మాత్రమే యూట్యూబ్ వీడియోను హైప్ చేయటానికి వీలుంటుంది. సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 5లక్షల కన్నా తక్కువున్న క్రియేటర్లు పోస్ట్ చేసిన వీడియోలకు మాత్రమే ఈ ఫీచర్ కనిపిస్తుంది.

**ఆటోమేటిక్ డబ్బింగ్:** ఆడియో ట్రాక్స్‌ను వీడియోలకు జత చేయటానికి ముందే వాటిని వివిధ భాషల్లోకి అనువాదం చేసుకోవటానికిది ఉపయోగపడుతుంది. కొద్ది నెలల్లో దీన్ని ప్రవేశపెట్టనున్నారు. కాకపోతే మొదట్లో స్పానిష్, పోర్చుగీస్, ఫ్రెంచ్, ఇటాలియన్ భాషలనే సపోర్టు చేస్తుంది. స్వరం, నినాదం, చుట్టుపక్కల పరిసరాల ధ్వనులనూ డబ్బింగ్ ఆడియోలో జొప్పించటానికిది తోడ్పడుతుంది. కామెంట్స్ విభాగంలో ఏఐ ఆధారిత జవాబుల సూచనలనూ ఎనేబుల్ చేయనున్నారు.

**ఆభరణాలు, బహుమతులు:** ఇవో కొత్త రకం డిజిటల్ ఐటెమ్‌లు. ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నప్పుడు అభిమానులు వీటిని క్రియేటర్లకు ఇవ్వచ్చు. ప్రాథమికంగా వీటిని అమెరికాలో వర్టికల్ ప్రత్యక్ష ప్రసారాలకే వర్తింపజేయనున్నారు.

**కనెక్టెడ్ టీవీ:** క్రియేటర్లు టీవీ తెరల మీదే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్న నేపథ్యంలో దీన్ని మరింత మెరుగు పరచటం మీద యూట్యూబ్ దృష్టి సారించింది. క్రియేటర్ల ఛానెళ్ల నుంచి నేరుగా టీవీల్లో వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలు ప్లే చేసుకోవటానికి వీలు కల్పించనుంది.





## ఐఫోన్ 16
# యాపిల్ మేధ



'ఇట్స్ గ్లోటైమ్' అని నినదిస్తూ సాగిన యాపిల్ ఐఫోన్ 16 ఆవిష్కరణ వేడుక నిజంగానే కొత్త శోభలతో ప్రకాశించింది. ఐఫోన్ ప్రియులకు పండుగను తలపించింది. ఐఫోన్ 16, 16 ప్లస్, 16 ప్రొ, 16 ప్రొ మ్యాక్స్‌తో పాటు వాచ్ 10, వాచ్ అల్ట్రా, కొత్త ఎయిర్‌పాడ్స్ కూడా గొప్ప ఆసక్తిని రేకెత్తించాయి. ఈసారి వేడుక మరో విశిష్టత యాపిల్ పరికరాలు దండిగా కృత్రిమ మేధ (ఏఐ)ను సంతరించుకోవటం. సొంత జనరేటివ్ ఏఐ పరిజ్ఞానమైన యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లతో ఇవి ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. యాపిల్ ఇంటెలిజెన్స్ ఫోన్లకు అందుబాటులోకి రావటానికి కాస్త సమయం పట్టొచ్చు. ఆలోపు దాని గొప్పతనమేంటో చూద్దాం.

**రాత సాధనాలు**

ఈమెయిల్ రాయాలన్నా, సంక్షిప్త సందేశాన్ని పంపించాలన్నా రైటింగ్ టూల్స్ చేదోడుగా నిలుస్తాయి. రాసే విషయాన్ని మరింత సరళంగా, హృద్యంగా, సంక్షిప్తంగా మారుస్తాయి. వృత్తి, ఉద్యోగాల సమాచారానికి అనుగుణంగానూ తీర్చిదిద్దుతాయి. టెక్స్ట్ సారాంశం, కీలక అంశాల జాబితా, పట్టిక వంటి వాటిని రూపొందించటానికీ ఉపయోగపడతాయి. టెక్స్‌ట్‌ను చదివి, అక్షర దోషాలనూ పరిహరిస్తాయి.

**ఏఐ ఎమోజీ**

ఎమోజీలను జెన్‌మోజీ మరింత ఉన్నత స్థితికి చేర్చనుంది. దీని ద్వారా యూజర్లు తమను తాము వ్యక్తపరచుకోవటానికి ఒరిజినల్ జెన్‌మోజీలను సృష్టించుకోవచ్చు. అదెలా ఉండాలో అక్షరాల్లో వర్ణిస్తే చాలు. దానికి అనుగుణమైన జెన్‌మోజీ ప్రత్యక్షమవుతుంది. అదనపు ఆప్షన్లూ ఉంటాయి. స్నేహితులు, కుటుంబసభ్యుల ఫొటోల ఆధారంగా వారి జెన్‌మోజీలనూ సృష్టించుకోవచ్చు. ఎమోజీల మాదిరిగానే వీటిని మెసేజ్‌లకు యాడ్ చేసుకోవచ్చు. స్టికర్‌గా షేర్ చేసుకోవచ్చు.

**సిరి మారుతోంది**

సిరి భారీగా మారనుంది. పూర్తిగా కొత్త రూపంతో భాషను మరింత బాగా అర్థం చేసుకోవటం, ఇంకాస్త సహజంగా సంభాషించటం వంటి గుణాలను సంతరించుకోనుంది. పర్సనల్ కంటెక్స్ట్ మీద అవగాహన కలిగుండటం, వేర్వేరు యాప్‌లతో పనిచేసే నైపుణ్యం, పరికరం ఫీచర్లు, సెటింగ్స్‌ను అర్థం చేసుకోవటంలాంటి నైపుణ్యాల మూలంగా మంచి వ్యక్తిగత సహాయకుడిలా పనిచేస్తుంది. బిగ్గరగా మాట్లాడలేని సందర్భాల్లో ఐఫోన్, ఐప్యాడ్ తెర కింద తాకి, టైప్ చేసి ఆదేశాలు ఇవ్వచ్చు కూడా. అంతకుముందు చేసిన విజ్ఞప్తులకు సంబంధించిన అంశాలను అడిగినా స్పందిస్తుంది. ఉదాహరణకు ఏదైనా వేడుకను క్యాలెండర్‌లో టిక్ చేసుకొని ఉన్నట్టయితే, ఇప్పుడక్కడ వాతావరణం ఎలా ఉందని అడిగితే వెంటనే జవాబిస్తుంది. ఆన్‌స్క్రీన్ మీదా సిరికి అవగాహన అబ్బింది. అందువల్ల తెర మీద జరుగుతున్న విషయాలనూ అర్థం చేసుకోగలదు. ఎవరైనా స్నేహితుడు అడ్రస్ మారిందని సందేశం పంపించారనుకోండి. కాంటాక్ట్ కార్డులో ఈ చిరునామాను చేర్చమని చెబితే చాలు. వెంటనే చేసి పెడుతుంది.

**పర్సనల్ కంటెక్స్ట్**

నిజానికిది ఫీచర్ కాదు, కానీ యాపిల్ ఇంటెలిజెన్స్‌కు స్తంభం వంటిదని చెప్పుకోవచ్చు. సిరిని ఏదైనా అడిగితే ఇది పరికరంలోని ఫొటోలు, క్యాలెండర్ వాటి నుంచి సమాచారాన్నీ తీసుకుంటుంది. ఉదాహరణకు అమెరికా నుంచి వచ్చే బంధువుల విమానం ఎప్పుడు దిగుతుందో మరచిపోయారనుకోండి. ఈ విషయాన్ని సిరిని అడిగితే అది స్క్రీన్‌షాట్స్, మెసేజెస్ నుంచి సమాచారాన్ని తీసుకొని జవాబిస్తుంది. క్రికెట్ మ్యాచ్, సినిమా టికెట్లు ఎక్కడ సేవ్ చేశామో మరచిపోయినా సిరిని అడగొచ్చు.

**ఇమేజ్ ప్లేగ్రౌండ్**

ఇదో సంక్షిప్త ఫీచర్. అయినా వాడుకోవటం తేలికే. ఇమేజ్ ప్లేగ్రౌండ్ పరికరంలోని ఏఐనే వాడుకుంటుంది. యూజర్ల అవసరాలకు తగిన సూచనలు అందిస్తుంది. మెసేజెస్, నోట్స్, కీనోట్స్, పేజెస్ వంటి యాప్స్‌లో వినోదాత్మక ఇమేజ్‌లను సృష్టించుకోవటానికిది వీలు కల్పిస్తుంది. ఆయా సందర్భాలకు అనుగుణంగా యానిమేషన్, ఇలస్ట్రేషన్, స్కెచ్ వంటి రూపాల్లో ఇమేజ్‌లను జనరేట్ చేసుకోవచ్చు. ఇందుకోసం బిల్టిన్‌గా వర్ణనలుంటాయి. కావాలంటే వాటిని మార్చుకోవచ్చు, సొంతగానూ వర్ణించొచ్చు. ఉదాహరణకు తెలిసిన వ్యక్తిని టోపీ, కోటు ధరించినట్టుగా ఇమేజ్‌ను సృష్టించమని అడగొచ్చు. పిల్లిని వ్యోమగామిగా అలకరించమని కోరొచ్చు. నిమిషాల్లో అవి ముందుంటాయి. ఈ ఫీచర్ ఫోన్‌లోని లైబ్రరీ, యాప్స్ ఇమేజ్‌లనే వాడుకుంటుంది. కొత్తగా సృష్టించుకున్న ఫొటోలను ఇతర యాప్స్‌తో షేర్ చేసుకోవచ్చు. అయితే ఇది రియలిస్టిక్‌గా కనిపించే ఇమేజ్‌లను సృష్టించదు. వదంతులు వ్యాపించకుండా చూడటానికే ఈ ఏర్పాటు.

**ఇమేజ్ వ్యాండ్**

నోట్స్‌లో ఏదో రాస్తుంటారు. హఠాత్తుగా అక్కడ ఒక చెట్టు బొమ్మ ఉంటే బాగుండునని అనిపించొచ్చు. ఇక్కడే ఇమేజ్ వ్యాండ్ మంత్రదండంలా పనిచేస్తుంది. ఇది నోట్స్ యాప్‌లో రఫ్ స్కెచ్‌ను దానికి సంబంధించిన ఇమేజ్‌గా మార్చేస్తుంది. వేలితో లేదా యాపిల్ పెన్సిల్‌తో స్కెచ్ చుట్టూ వృత్తాన్ని గీస్తే చాలు. ఇమేజ్ వ్యాండ్ ఆ అంశాన్ని విశ్లేషించి, దానికి అనుగుణమైన బొమ్మను సృష్టిస్తుంది. ఖాళీ భాగంలో వృత్తాన్ని గీసినా ఇమేజ్ వ్యాండ్ చుట్టుపక్కల ఉన్న అంశాల ఆధారంగా ఇమేజ్‌ను ముందుంచుతుంది.

**ఛాట్‌జీపీటీ ఇంటిగ్రేషన్**

ఓపెన్ ఏఐ రూపొందించిన ఛాట్‌జీపీటీని సిరి, రైటింగ్ టూల్‌స్‌కు సమ్మిళితం చేయటం వల్ల పనులు మరింత సులభం కానున్నాయి. ఫొటోలు, డాక్యుమెంట్లకు సంబంధించిన ప్రశ్నలను సిరికి సంధిస్తే అది ఛాట్‌జీపీటీ సహాయమూ తీసుకుంటుంది. కంపోజ్ ఇన్ రైటింగ్ టూల్‌స్‌తో చిత్తు ప్రతి నుంచీ ఒరిజినల్ కంటెంట్‌ను సృష్టించుకోవచ్చు. ఖాతా లేకపోయినా ఛాట్‌జీపీటీని యాక్సెస్ చేయొచ్చు. ఛాట్‌జీపీటీ సబ్‌స్క్రయిబర్లయితే ఖాతాలతో కనెక్ట్ అయ్యి పెయిడ్ ఫీచర్లనూ వాడుకోవచ్చు.

ప్రజాభూమి

# 'రోలెక్స్'.. అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చిన సూర్య



కమల్ హాసన్ (Kamal Haasan) హీరోగా లోకేశ్ కనగరాజ్ (Lokesh Kanagaraj) తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' (Vikram). 2022లో విడుదలైన ఈ చిత్రంలో సూర్య (Suriya) పోషించిన 'రోలెక్స్' (Rolex) పాత్రకు ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్ ఉన్న విషయం తెలిసిందే. మాదకద్రవ్యాల గ్యాంగ్‌లీడర్‌గా సినిమా క్లైమాక్స్‌లో ఆయన పండించిన విలనిజం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. రోలెక్స్ పాత్రను ఆధారంగా చేసుకొని ఒక పూర్తిస్థాయి సినిమాను తెరకెక్కిస్తానని లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. ఈనేపథ్యంలోనే 'కంగువా' (kanguva) ప్రమోషన్స్‌లో 'రోలెక్స్' మూవీ గురించి సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను నటించిన ఓ సినిమాతో దీనికి సంబంధం ఉంటుందన్నారు. "1986లో విడుదలైన 'విక్రమ్'తో 2022లో వచ్చిన 'విక్రమ్'కు ఏవిధంగా లింక్ ఉందో అదేవిధంగా 'రోలెక్స్'కూ నేను నటించిన ఒక సినిమాతో కనెక్షన్ ఉంటుంది'' అని తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ సినిమా ఏమై ఉంటుందా? అని 'ఎక్స్' వేదికగా పలువురు నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

సూర్య నటించిన తాజా చిత్రం 'కంగువా'. శివ దర్శకుడు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇందులో సూర్య మూడు విభిన్న లుక్స్‌లో కనిపించనున్నారని సమాచారం. దిశాపటానీ కథానాయిక. బాబీ దేవోల్ కీలకపాత్ర పోషించారు. పీరియాడిక్ యాక్షన్ జానర్‌లో ఇప్పటివరకు తెరపైకి రాని ఓ కొత్త కాన్సెప్ట్‌లో దీనిని చిత్రీకరించినట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దాదాపు రూ.2000 కోట్లు వసూలుచేస్తుందని నిర్మాత ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ముంబయిలో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు సూర్య. సినిమా విశేషాలు, కొత్త ప్రాజెక్ట్ వివరాలు వెల్లడించారు. ఇందులో భాగంగానే 'రోలెక్స్' గురించి మాట్లాడారు.

లోకేశ్ కనగరాజ్ ప్రస్తుతం 'కూలీ' పనుల్లో బిజీగా ఉన్నారు. రజనీకాంత్ హీరోగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమా తర్వాత తాను (లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్) ఎల్‌సీయూ హీరోలందరితో కలిసి అదిరిపోయే మూవీ చేయాలనుకుంటున్నానని ఇటీవల చెప్పారు. "'విక్రమ్'ని అద్భుతంగా పూర్తి చేసేందుకు 'రోలెక్స్' సీన్స్ క్రియేట్ చేశా. ఆ పాత్రకు వచ్చిన క్రేజ్ దృష్టిలో ఉంచుకొని 'రోలెక్స్'పై ఒక స్టాండలోన్ మూవీ చేయాలనుకుంటున్నా. 'కూలీ' పూర్తి చేసిన తర్వాత, LCUలోని హీరోలందరితో పీక్ ఎల్‌సీయూ మూవీ చేయనున్నా'' అని తెలిపారు.

# నాకెలాంటి విచారం లేదు..
## లీడ్ రోల్ చేయాలనుంది: మలైకా



ఎలాంటి విచారం లేకుండా జీవిస్తున్నానని బాలీవుడ్ నటి మలైకా అరోరా (Malaika Arora) అన్నారు. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. "ఇప్పటి వరకూ నేను ఏ విషయంలోనూ పశ్చాత్తాపం చెందలేదు. తప్పులు చేస్తూ.. కొత్త అంశాలు నేర్చుకుంటున్నా. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నేనిప్పుడు ఇలా ఉన్నానంటే నేను తీసుకున్న నిర్ణయాలే కారణం'' అని పేర్కొన్నారు. గత కొంతకాలంగా నటుడు అర్జున్ కపూర్ (Arjun Kapoor)తో రిలేషన్‌షిప్‌లో ఉన్న ఆమె ఇటీవల విడిపోయారని బాలీవుడ్‌లో వార్తలొచ్చాయి. ఆ బ్రేకప్‌ను ఉద్దేశించే మలైకా ఇలా మాట్లాడారంటూ నెట్టింట చర్చ సాగుతోంది.

సినిమాల గురించి మలైకా మాట్లాడుతూ.. "చాలా సినిమాల్లో నేను అతిథి పాత్రల్లో, ప్రత్యేక గీతాల్లో నటించా. ప్రధాన పాత్రధారిగా ఓ సినిమా చేయాలనుంది'' అని మనసులో మాట బయటపెట్టారు. ప్రస్తుతం ఫుడ్ బిజినెస్‌పై దృష్టి సారించానన్నారు. మరిన్ని విహారయాత్రలు చేయాలనుందని తెలిపారు. 'అతిథి'లోని రాత్రైనా నాకు ఓకే, 'గబ్బర్‌సింగ్'లోని 'కెవ్వు కేక' వంటి పాటల్లో నటించి, తెలుగు ప్రేక్షకులను అలరించారు మలైకా.

# షూటింగ్ సమయంలో తల తిరిగేది..
## మయోసైటిస్ రోజులను గుర్తుచేసుకున్న సమంత


సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'సిటాడెల్: హనీ బన్ని'. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా ప్రసారం కానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో టీమ్ ఆసక్తి పెంచుతుంది. తాజాగా సమంత (Samantha) తన పాడ్‌కాస్ట్‌లో దీని షూటింగ్ గురించి మాట్లాడుతూ.. మయోసైటిస్ రోజులను మరోసారి గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో 'సిటాడెల్' టీమ్ ఎంతో సాయం చేసిందన్నారు.

"నేను ఇప్పటివరకు పనిచేసిన అత్యంత కష్టమైన ప్రాజెక్ట్ 'సిటాడెల్'. ఈ టీమ్ నాలో ధైర్యాన్ని నింపింది. ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటూ మద్దతునిచ్చింది. నాపై ఎంతో నమ్మకంతో ఈ సిరీస్‌ను కొనసాగించింది. వారికి నాపై నమ్మకం లేకుంటే నేను ఈరోజు ఇక్కడ ఉండేదాన్ని కాదు. జీవితంలో మనం కష్టాలను ఎదుర్కొనే సమయంలో దేవుడు కచ్చితంగా సాయం చేస్తాడు. ఆ పరిస్థితుల నుంచి బయటపడడానికి సాయం చేసిన వారిని మనం ఎల్లప్పుడూ గుర్తుచుకోవాలి. వారిపై కృతజ్ఞతా భావంతో ఉండాలి. రాజ్ అండ్ డీకేతో పాటు సిరీస్ బృందమంతా నన్ను జాగ్రత్తగా చూసుకుంది. ఇంత మంచి టీమ్ దొరికినందుకు నేనెంత అదృష్టవంతురాలినో అని అనిపించింది. ఒక్కోసారి ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించే సమయంలో తల తిరిగేది. నావల్ల కాదు అనిపించేది. అయినా ప్రాజెక్ట్‌ను (Citadel: Honey Bunny) పూర్తి చేశాను'' అని చెప్పారు.



## ధర్మేంద్రతో లిప్‌లాక్ సన్నివేశం..
# నా భర్త అనుమతి తీసుకున్నా: షబానా అజ్మీ

రణ్‌వీర్ సింగ్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాకీ ఔర్ రాణీ కి ప్రేమ్ కహానీ'. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ధర్మేంద్రతో లిప్‌లాక్ సన్నివేశం గురించి షబానా అజ్మీ మరోసారి మాట్లాడారు. తన భర్త అనుమతి తీసుకొని ఆ సన్నివేశంలో నటించినట్లు తెలిపారు. "మేకర్స్ నన్ను ఈ సినిమా కోసం సంప్రదించగానే కథ నచ్చడంతో అంగీకరించాను. ఇందులోని లిప్‌లాక్ సన్నివేశం గురించి కరణ్ వివరించారు. నా భర్త అనుమతి తీసుకొని చెబుతానన్నాను. ఈ విషయం గురించి నా భర్తను అడిగితే 'ఇది చాలా చిన్న విషయం. దీనికి నా అనుమతి ఎందుకు' అన్నారు. ప్రేక్షకులంతా పిల్లలతో కలిసిచూసి ఈ సినిమాను ఎంజాయ్ చేశారు. ఈ చిత్రంలో నేను పోషించిన అతిథి పాత్ర ఎప్పటికీ నాకు గుర్తుంటుంది' అని షబానా చెప్పారు.



printed& Published &edited by Chandra shekar vippala, from Adhya publications, hyderabad, phone no... 9951121243 (Trial version)